
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5 గురువారం 13 ఫిబ్రవరి 2025

ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట

● కోటప్పకొండ మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షలో మంత్రి ఆనం 6

సివిల్ జడ్జిలకు పదోన్నతిపై బదిలీలు

పురుగుల మందు తాగి కుమారుడు.. ఉరేసుకుని తల్లి ఇద్దరూ ఆత్మహత్య



● కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌ను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

కిమ్స్ ప్రస్థానం స్ఫూర్తిదాయకం

● గుంటూరులో ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాతికేళ్ల కిందట నెల్లూరులో ఆస్పత్రి ఏర్పాటు ద్వారా వైద్యరంగంలో తన ప్రస్థానం ప్రారంభించిన కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ నేడు ఐదు రాష్ట్రాలకు విస్తరించి ఐదు వేల పడకలతో రోగులకు విస్తృత స్థాయిలో సేవలు అందించడం ప్రశంసనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళదాస్‌నగర్ సమీపంలో 200 పడకలతో నిర్మించిన కిమ్స్ శిఖర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ను బుధవారం సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ, మహరాష్ట్ర, కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో కిమ్స్ ఆస్పత్రులు రోగులకు చక్కటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు ఆస్పత్రిలో పని చేసే ఉద్యోగులకు షేర్ ఇచ్చారని తెలిపారు. పది వేల మంది ఉద్యోగులు పెట్టుబడులు పెట్టారని చెప్పారు. సంస్థ బాగుండాలంటే అందులో పని చేసే ఉద్యోగుల భాగస్వామ్యం అవసరమేనన్నారు.

అమరావతిలో వెయ్యి పడకలతో ఆస్పత్రి..

రాజధాని అమరావతిలో త్వరలో వెయ్యి పడకలతో అత్యాధునిక ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు తెలిపారు. గుంటూరులోని హాస్పిటల్‌ను త్వరలో 500 పడకల సామర్థ్యానికి పెంచుతామన్నారు. విజయవాడలో కూడా అత్యాధునిక వసతులతో 500 పడకలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్‌యాదవ్, పొంగూరు నారాయణ, కింజరావు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, కందుల లక్ష్మీదుర్గేశ్, ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, కన్నా లక్ష్మీనారాయణ, బూర్ల రామాంజనేయులు, మాలకొండయ్య, దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డి, డిప్యూటీ మేయర్ సజీల, ఆస్పత్రి సీఈవో డాక్టర్ బీ అభినయ్, వైద్యనిపుణులు డాక్టర్ చిట్టెం లక్ష్మణరావు, డాక్టర్ పీవీఎస్ హరిత, డాక్టర్ కొల్లి జయ కిషన్, డాక్టర్ వడ్లమూడి సుధీర్, డాక్టర్ మాలెంపాటి రాజశేఖర్, డాక్టర్ రావెళ్ల విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకం దగ్గర సీఎం చంద్రబాబు, చైర్మన్ భాస్కరరావు తదితరులు

పల్లె పండుగకు పైసలేవీ..!



సిమెంట్ రోడ్డు

పల్లె పండుగ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. పూర్తయిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగడంలేదు. రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రూ 83.06 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రహదారులు.. మురుగు కాలువల నిర్మాణం.. గోకులాలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణం తదితర పనులు నిధుల లేమితో నిలిచిపోతున్నాయి. దీంతో పనులు పూర్తి చేసేందుకు పల్లె కమిటీలు ముందుకు రావడంలేదు. పథకం ప్రారంభం లో వారం.. వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరగడంతో పెద్ద ఎత్తున పనులు చేపట్టారు. పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగక పోతుండటంతో పనులను నిలిపివేస్తున్నారు.

● బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
● నిలిచిపోతున్న పనులు, నిర్మాణాలు
● రూ. 83.06 కోట్ల బకాయిలు
● రెండు నెలలుగా ఆగిన చెల్లింపులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీసం రోడ్లు, మురుగుకాలువలు వంటి మౌలిక సదుపాయలు కల్పించపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న దారులను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్రారంభంలో ప్రగతి పనులు పరుగులు తీశాయి. అయితే పూర్తి చేసిన పనులకు బిల్లుల చెల్లింపులు జరగక పోవడంతో పనులకు ఎక్కడకక్కడ నిలిపివేస్తున్నారు. గుంటూరు.. బాపట్ల.. పల్నాడు జిల్లాల్లో పల్లె పండుగలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికి 57.95 శాతం పనులు మాత్రమే పూర్తయినట్టు డ్వామా శాఖ లెక్కలు చెబుతున్నాయి.


పల్నాడు జిల్లాలో రూ 62.44 కోట్ల వ్యయంతో గ్రామాల్లో రహదారులు.. మురుగు కాలువలు.. స్కూల్స్ ప్రహరీల నిర్మాణం 524 పనులు చేపట్టగా ఇప్పటికి 350 పనులు పూర్తి చేశారు. 66.67 శాతం పనులు పూర్తయినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. బాపట్ల జిల్లాలో 644 పనులు 67.67 కోట్ల వ్యయంతో చేపట్టగా 447 పనులు పూర్తయ్యాయి. 61.91 శాతం పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలో 170 పనులను రూ 14.54 కోట్ల వ్యయం తో చేపట్టగా ఇప్పటికి 77 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 45.29 శాతం పనులు పూర్తయ్యాయి. కాంట్రాక్టు విధానంలో కాకుండా నామినేషన్ నిర్వహిస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సూచించిన వ్యక్తుల చేత పనులు చేపట్టారు. ఈ విధానంలో దాదాపు 13 శాతం వరకు ప్రభుత్వానికి నిధులు ఆదా అవుతున్నాయి. కమిటీల పర్యవేక్షణలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోకులాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. గోకులం షెడ్ల నిర్మాణం చేపట్టిన అనంతరం నాలుగు విడతలుగా బిల్లులు చెల్లించాలి. పిల్లర్, రూఫ్, ఫ్లోరింగ్, ఫినిషింగ్ దశల్లో బిల్లులు చెల్లించాల్సి ఉంది. లబ్ధిదారుని బ్యాంకు ఖాతాకు ఉపాధి పథకం కింద బిల్లుల మొత్తాన్ని జమ చేయాలి. సుమారు రెండు నెలలుగా ఉపాధి హామీ పథకం స్లాట్ విడుదల కావడంలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో పనులు చేయించిన రైతులు ఉపాధి హామీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. బిల్లుల ఎప్పుడు చెల్లించేది స్పష్టంగా అధికారులు లబ్ధిదారులు చెప్పకపోతుండటంతో వారు అవేదనకు లోనవుతున్నారు. పశువుల షెడ్లకు లబ్ధిదారుడు 10 శాతం చెల్లిస్తే 90 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. కోళ్ళ, గొర్రైలు, మేకలు పెంపకందారులు వారి వాటా ధనం మొత్తం వ్యయంలో 30 శాతం చెల్లిస్తే 70 శాతం ప్రభుత్వం నిధులు ఇస్తుంది. సొంత స్థలం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం కల్పించారు. ఇటీవల ప్రజా ప్రతినిధులు పూర్తయిన గోకులం షెడ్‌లను ఆర్భాటంగా ప్రారంభించారు. అయినా బిల్లుల చెల్లింపులు జరగడంలేదు.

పల్నాడు జిల్లాలో 714 గోకులాలు మంజూరు కాగా 672 షెడ్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 458 షెడ్ల నిర్మాణం పూర్తయింది. వీటిలో 243 షెడ్లను ప్రారంభించారు. బాపట్ల జిల్లాలో 683 గోకులాలు మంజూరు కాగా 681 షెడ్‌ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 405 షెడ్ల నిర్మాణం పూర్తయింది. 222 షెడ్లను ప్రారంభించారు. గుంటూరు జిల్లాలో 386 షెడ్ల మంజూరు కాగా 379 షెడ్ల నిర్మాణం చేపట్టారు. వీటిలో 207 షెడ్ల నిర్మాణం పూర్తి చేశారు. 67 షెడ్లను ప్రారంభించారు. మిగతా షెడ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లించకపోతుండటంతో షెడ్ల నిర్మాణాలను పాడి రైతులు నిలిపివేస్తున్నారు. అధిక శాతం షెడ్లు 4 నుంచి ఆరు పశువుల యూనిట్ల నిర్మాణం చేపట్టారు. షెడ్ల నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. అప్పులు చేసి షెడ్‌లు నిర్మించుకున్నామని వెను వెంటనే బిల్లులు చెల్లించి ఆదుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు. బిల్లుల చెల్లింపులలో జాప్యంపై పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తిని సంప్రదించగా, పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని రానున్న వారం రోజుల్లో బిల్లుల చెల్లింపు జరిగే అవకాశం ఉందని తెలిపారు.

ప్రగతి పనులు.. గోకులం షెడ్ల బకాయిలు జిల్లాల వారీగా..

జిల్లా	రూ కోట్లలో
● పల్నాడు	41.90
● బాపట్ల	34.12
● గుంటూరు	10.04



గోకులం షెడ్



● మురుగు కాలువల నిర్మాణం

గడువులోపే రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి

● కంబైన్డ్ క్రూ లాబీలో సకల సదుపాయాలు ఉండాలి
● గుంటూరు రైల్వే డివిజన్ ఇన్‌స్పెక్షన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్

8



పొందుగల వద్ద కృష్ణానదిపై ఉన్న వంతెన మ్యాపును పరిశీలిస్తున్న జీఎం

పల్నాడులో లెదర్‌పార్కు

వినుకొండ, మాచర్ల, నకరికల్లులో కొరియా నిపుణుల పర్యటన



వెంకుపాలెం సమీపంలో భూముల మ్యాపును పరిశీలిస్తున్న ప్రతినిధులు

8

వలస పక్షులపై నిఘా

● బర్డ్ ఫ్లూ వదంతులతో పశుసంవర్ధకశాఖ అలెర్ట్ ● ఉప్పలపాడు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు ● సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసే అవకాశం ● ఉమ్మడి గుంటూరు జిల్లాలో కేసులు లేవన్న అధికారులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వణికిస్తోంది. కోళ్లు పెద్దసంఖ్యలో చనిపోతున్నాయి. చికెన్ విక్రయాలపై అధికారులు నిషేధం విధించారు. కొన్ని జిల్లాల్లోని పలు ప్రాంతాలను రెడ్‌జోన్‌గా ప్రకటించారు. ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల సరఫరాను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో చికెన్ విక్రయాలు దారుణంగా పడిపోయాయి. ఈ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తికి ప్రధాన వాహకంగా ఉన్న వలస పక్షులపై పశుసంవర్ధకశాఖ నిఘా వేసింది. వలస పక్షుల ద్వారా కూడా బర్డ్‌ఫ్లూ విస్తరించే అవకాశం ఉన్న నేపథ్యంలో గుంటూరు సమీపంలోని పక్షుల కేంద్రాన్ని పశుసంవర్ధకశాఖ అధికారులు బుధవారం ప్రత్యేకంగా పరిశీలించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు, జిల్లా వ్యాధుల నిర్ధారణ ప్రయోగశాల ఏడీ బి.మాధవి తదితరులు వలస పక్షుల ఆరోగ్యంపై ఆరాతీశారు. పక్షులు తాగే నీటి వనరులను పరిశీలించారు. అక్కడ ఉన్న పశుసంవర్ధక శాఖ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. వలస పక్షుల లో అసహజ మరణాలు సంభవిస్తే వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం గుంటూరులోని జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడా బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవన్నారు. అలా అని నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీలపై దృష్టి సారించాలన్నారు. అధికారులు పౌల్ట్రీలను సందర్శించి కోళ్ల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాల మేరకు అవసరమైతే జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొల్లేరుకు వచ్చిన వలస పక్షుల వల్లే ఆ ప్రాంతంలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందిందని, దాని ప్రభావం ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా లేదన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా బర్డ్ ఫ్లూ కేసులు లేవని ప్రకటించారు.

తగ్గిన కొనుగోళ్లు

గుంటూరు: పౌల్ట్రీ రంగాన్ని వణికిస్తున్న బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్ ఉమ్మడి గుంటూరు జిల్లాపై ఎక్కడా లేదని, వదంతులను నమ్మొద్దని అధికారులు సూచిస్తున్నారు. బర్డ్ ఫ్లూ ప్రచారంతో చికెన్ వద్దంటూ ప్రజలు భయపడుతున్నారు. దాంతో కొనుగోళ్లు కూడా సగానికి పడిపోయినట్లు పౌల్ట్రీ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 2న ఆదివారం చికెన్ కిలో స్కిన్‌లెస్ రూ.250కు విక్రయించారు. బర్డ్ ఫ్లూ ప్రచారం ప్రభావంతో మొన్నటి ఆదివారం కిలో 200లకు పడిపోయింది. వారం వ్యవధిలోనే కిలోకు రూ.50 తగ్గి పోవడంతో వ్యాపారులు హైరానా పడుతున్నారు. గత నెలలో గరిష్ఠంగా కిలో రూ.270 వరకు విక్రయించగా ప్రస్తుతం చాలావరకు తగ్గిపోయింది అయినా కొనుగోళ్లు సగానికి సగం పడిపోయాయి.



ఉప్పలపాడు వలస పక్షుల కేంద్రాన్ని సందర్శించిన జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు తదితరులు

దిగి వస్తోన్న గుడ్డు ధర..

బర్డ్ ఫ్లూ ప్రచారం అంటుంచితే చికెన్‌తో పాటు కోడిగుడ్డు ధర కూడా దిగి వస్తోంది. గుడ్డు రూ.4.50లకు చేరుకుంది. హోల్‌సేల్‌లో డిసెంబరు, జనవరిలో గరిష్ఠంగా రూ.6ల వరకు విక్రయించారు.



చీటీ..ఫండ్స్

● బోర్డులు తిప్పేస్తోన్న సంస్థలు
● ఏడాదిలో నరసరావుపేటలో రెండు సంస్థల మూత
● కొరవడిన పర్యవేక్షణ.. రూ. కోట్లలో నష్టపోయిన మదుపరులు





సాయిసాధన చిట్ కార్యాలయానికి తాళాలు వేస్తున్న పోలీసులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అత్యవసర సమయాల్లో.. కష్టకాలంలో అక్కరకు వస్తాయని.. సామాన్యులు, మధ్యతరగతి జీవులు తినీతినక చిట్టు వేస్తుంటారు. ఇదే అవకాశంగా మాయమాటలతో, వడ్డీల ఆశతో రూ.కోట్లలో పోగేసుకుని చిట్ సంస్థలు ఒక్కొక్కటిగా బోర్డు తిప్పేస్తున్నాయి. ఒక్క నరసరావుపేటలోనే ఏడాది కాలంలో రెండు చిట్ సంస్థలు మూతపడ్డాయి. చిట్‌ల సంస్థల నిర్వహణలో నష్టాలురావు. అయినా మదుపరుల నుంచి చిట్ పేరుతో డబ్బు వసూలు చేసుకుని ఉడాయిస్తున్నారు. గతంలో నరసరావుపేటలో సిరి, నేడు సాయిసాధన చిట్ సంస్థలు బోర్డు లు తిప్పేయగా చిట్ సభ్యులు దారుణంగా మోసపోయారు. రిజిస్టర్డు చిట్ సంస్థలుగా ఉన్న వీటిపై రిజిస్ట్రేషన్ శాఖ పర్యవేక్షణ లేదు. చిట్ సంస్థల నిర్వహణకు కఠినమైన చట్టం ఉన్నా దానిని అమలు చేయడం లేదు. అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కు కావడంతో మదుపరులను నిర్వాహకులు మోసగిస్తున్నారు.

నిబంధనలు ఇలా..

రిజిస్టర్డు సంస్థలు రూ.10 లక్షల చిట్ నిర్వహిస్తే చట్టప్రకారం (మిగతా 6వ పేజీలో)



నరసరావుపేటలో సాయిసాధన బాధితుల ఆందోళన

వందల్లో సాయిసాధన బాధితులు

సాయిసాధన చిట్ సంస్థ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు వందలాది మంది సభ్యులను రూ.కోట్లలో మోసగించాడు. గుంటూరు, నరసరావుపేట పోలీసు స్టేషన్లలో బాధితుల ఫిర్యాదుల మేరకు ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల్లో పుల్లారావు లొంగిపోగా ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. ప్రాథమికంగా తేల్చిన లెక్కల ప్రకారం 323 మంది నుంచి రూ.103,95,49,582 డిపాజిట్లు ఉన్నాయి. వీరు కాక మోసపోయిన చిట్ సభ్యులు కూడా వందల్లో ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. పుల్లారావు భార్య కూడా సంస్థలో డైరెక్టర్‌గా ఉన్నారు. 2021 నుంచి పథకం ప్రకారం డిపాజిట్లు స్వీకరించడంతో పాటు.. అక్రమంగా చిట్లు నిర్వహించి మోసగించినట్లు పోలీసుల విచారణలో తేలింది. బాధితులు గత వారం రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. పుల్లారావుతో పాటు ఆయన కుటుంబసభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల, బంగారు వస్తువులు విక్రయించి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను బాధితులు కోరుతున్నారు.

సివిల్ జడ్జిలకు పదోన్నతిపై బదిలీలు

గుంటూరు(లీగల్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు కోర్టులలో పనిచేస్తున్న సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)లకు పదోన్నతి కల్పించి మరో కోర్టు లో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)లు గా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) గా పనిచేస్తున్న మహమ్మద్ ఇష్రత్ ఫాతిమాను పదోన్నతిపై ఇక్కడే ఖాళీగా ఉన్న రెండో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)గా (ఫాస్ట్ ట్రాక్ కోర్టు) నియమించారు. విజయవాడలోని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పనిచేస్తున్న సయ్యద్ జియావుద్దీన్ ను పదోన్నతిపై గుంటూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమించారు. మంగళగిరిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న సీహెచ్.వి.రామకృష్ణను పదోన్నతిపై ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. కడప జిల్లా కమలాపురంలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న నక్కా లావణ్యను పదోన్నతిపై నరసరావుపేటలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. అక్కడ పని చేస్తున్న కె.మధుస్వామిని నర్సరావుపేటలోనే ఖాళీగా ఉన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న వి.విజయ్ కుమార్ రెడ్డిని పదోన్నతి పై సత్తెనపల్లిలో సీనియర్ సివిల్ జడ్జిగా (ఖాళీగా ఉంది) నియమించారు. మంగళగిరిలోని జ్యూడీషియల్ అకాడమీలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి వి.సత్యలక్ష్మీ ప్రసన్నను పదోన్నతిపై నందిగామలో సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. పదోన్నతిపై బదిలీ అయిన న్యాయమూర్తులు ఈ నెల 24 లోపు కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు.

చనిపోయిన వారూ.. ఉపాధి పనులకు హాజరు!


పంచాయతీ జారీ చేసిన మరణ ధ్రువీకరణ పత్రం

చుండూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వాళ్లు 7-8 సంవత్సరాల క్రితం చనిపోయారు. అయితే ఉపాధి హామీ అధికారులు గతేడాది ఉపాధి హామీ పథకం పనుల కోసం తిరిగి వాళ్లని భూమి మీదుకు తీసుకొచ్చారు. ఈ సంఘటన కార్మూరువారిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కంచర్ల జగ్గయ్య (55) ఏప్రిల్ 8, 2016లో చనిపోయారు. గ్రామ పంచాయతీ డిసెంబరు 3, 2016న మరణ ధ్రువీకరణ పత్రం కూడా జారీ చేసింది. ఈ మృతుడు గతేడాది వంద రోజుల పాటు గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్నట్లు రికార్డుల్లో ఉంది. అదేవిధంగా ముత్యాల అమర్తయ్య (60) ఆగస్టు 10, 2021లో మరణించాడు. ఆగస్టు 27, 2021 గ్రామ పంచాయతీ మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చింది. అలాగే పచ్చా కామేశ్వరరావు 2022 జూలై 7న మరణించాడు. అధికారులు వీరికి ప్రాణం పోసి ఉపాధి పనుల్లో పెట్టుకున్నారు. చనిపోయిన వారికి, విదేశాల్లో ఉంటున్న వారికి అధికారులు ఉపాధి పనుల్లో హాజరు వేశారు. 10 ఏళ్లుగా దుబాయ్‌లో ఉంటున్న గ్రామానికి చెందిన ముత్యాల మస్తాన్‌రావు ఇక్కడి ఉపాధి పనుల్లో ఉన్నట్లు రికార్డులో ఉంది. జబ్బు పడి, మోకాళ్ల అరిగి నడవలేక మంచానికే పరిమితమైన వారు కూడా రెండు, మూడు నెలలు ఉపాధి పనులు చేసినట్లు రికార్డులకెక్కారు. వివిధ వృత్తులు చేసుకుంటూ ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఈ గ్రామానికి చెందిన మరో 15 మంది కూడా ఇక్కడి ఉపాధి పనులు చేసినట్లు రికార్డుల్లోకి ఎక్కారు. కార్మూరువారిపాలెం మైనర్ పంచాయతీ. 800 జనాభా. ఈ చిన్న గ్రామంలో గత ఐదేళ్లలో లక్షలాది రూపాయల ఉపాధి హామీ పనుల్లో గోల్‌మాల్ జరిగింది. గత ప్రభుత్వంలో అధికారులు, నాయకులు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారు. ఈ దోపిడీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉత్సవాల్లో సామాన్య భక్తులకే పెద్దపీట

- కోటప్పకొండ మహాశివరాత్రి ఏర్పాట్లుపై సమీక్షా సమావేశంలో మంత్రి ఆనం


సమావేశంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేసి, ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సచివాలయంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన కోటప్పకొండ మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్షా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలులో ఉండటం వలన కోటప్పకొండలో భౌతికంగా సమావేశం నిర్వహించకుండా సచివాలయంలో సమీక్ష నిర్వహించామన్నారు. కోటప్పకొండలో మహాశివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. భక్తుల భద్రత, వసతులు, ట్రాఫిక్ నిర్వహణ, అన్నదానం, వైద్య సదుపాయాలు, పండగ ఏర్పాట్లపై పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలకు సూచనలు ఇచ్చారు. తాగునీటి, వైద్య సహాయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రత్యేక అదనపు పోలీసు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, వీఐపీల రాకపోకలు సజావుగా ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి పదేళ్లుగా పోరాటాలు చేస్తున్నప్పటికీ, సమస్యలు అంతంత మాత్రంగానే పరిష్కారం అయ్యాయని, సకల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉన్నతాధికారులతో కమిటీని వేసి కార్యాచరణ ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పల్నాడు జిల్లా అమరావతి మండలం ధరణికోట గ్రామంలోని జేబీ కల్యాణ మండపంలో నిర్వహించిన అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి సమావేశానికి ముప్పాళ్ల ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ కస్టమర్స్‌ను నమ్మించి రూ. 6,365 కోట్లు డిపాజిట్లు సేకరించి, ఆ సొమ్మును కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీదారుల పేరు మీద పెట్టుకుని కస్టమర్లను వేధిస్తున్నారని అన్నారు. తాము చేస్తున్న పోరాటాల వలన అగ్రిగోల్డ్ యాజమాన్యం నుంచి వేలాది ఎకరాల భూమి, లక్షలాది చదరపు గజాల స్థలాలు, పలు రకాల కంపెనీలు, భవంతులు, హాయ్‌ల్యాండ్ నుంచి యారాడ రిస్సార్ట్ వరకు ప్రభుత్వంచే అటాచ్‌మెంట్ చేయించినట్లు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి హయాంలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి కొంతమేర నెరవేర్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తాము అధికారంలోకి రాగానే బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా, బాధితులకు ఎలాంటి ఫలితం దక్కలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ నాయుడు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, రైతు సంఘ నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, వివిధ జిల్లాల అధ్యక్షులు, అగ్రిగోల్డ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

భూ సమీకరణ పద్ధతిలో మా భూములు ఇస్తాం

- రైల్వేలైన్ బాధిత రైతుల ఉమ్మడి నిర్ణయం


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్రం ఖమ్మం సమీపంలోని ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు సుమారు 53 కి.మీ రైల్వేలైను నిర్మాణానికి సంబంధించి పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని మూడు గ్రామాల పరిధిలో సేకరించాల్సిన 330 ఎకరాలకు సంబంధించి అభ్యంతరాలు తెలిపిన రైతులతో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు పక్కనే ఉన్న హరిత రిసార్ట్‌లో మూడు గ్రామాల రైతులతో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ డానియేలు, సీఐ అచ్చయ్య, ఆర్డీవో కార్యాలయం ఏవో చంద్రారెడ్డి, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొని రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కర్లపూడి గ్రామానికి చెందిన రైతు మంచికలపూడి శివప్రసాద్ తమ గ్రామపరిధిలో సుమారు 240 ఎకరాలు రైల్వేలైన్‌కు పోతుందనీ, గతంలో కూడా రాజధాని పూలింగ్‌లో 150 ఎకరాలు తీసుకున్నారనీ, అందువలన కర్లపూడి గ్రామంలోని భూమి మొత్తం పూలింగ్ కింద తీసుకోవాలని ఆర్డీవోకు తెలిపారు. వైకుంఠపురం గ్రామానికి చెందిన బి.శేషుబాబు తమ గ్రామపరిధిలో రైల్వేలైన్, గోదావరి, పెన్నా కాలువ కింద భూమి ఎక్కువ పోతుందనీ, అంతేగాక 22ఏ కింద ఉన్న భూమికి నష్టపరిహారం దేవాలయానికి ఇస్తారా లేక సంబంధిత రైతుకు ఇస్తారా తెలియజేయాల్సి ఉందని ఆర్డీవోను కోరారు. తాము కూడా పూలింగ్ ద్వారానే భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి సేకరించే భూమికి మార్కెట్ విలువ కన్నా మూడు రెట్లు అధికంగా నష్టపరిహారం ఇస్తామని తెలిపారు. పూలింగ్ అనేది ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశమని తెలియజేశారు. రైతుల విన్నపాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పురుగుల మందు తాగి కుమారుడు.. ఉరేసుకుని తల్లి

- ఇద్దరూ ఆత్మహత్య
- ఇంటి నుంచి దుర్వాసన రావడంతో తలుపులు తీసిన స్థానికులు


వెల్లటూరు నాగేంద్రం (ఫైల్)


నాగరాజకుమారి(ఫైల్)

రేపల్లె, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భార్య, భర్తల మధ్య గొడవల కారణంగా భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది చూసిన తల్లి తట్టుకోలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పట్టణంలోని 4వ వార్డులో బుధవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని 2వ వార్డుకు చెందిన లక్ష్మీతిరుపతమ్మతో వెల్లటూరు నాగేంద్ర(26)కు ఏడు సంవత్సరాల క్రితం వివాహం అయింది. నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్య, భర్తల మధ్య ఏర్పడిన మనస్పర్ధలతో మూడు సంవత్సరాల నుంచి లక్ష్మీ తిరుతమ్మ కుమారుడితో పుట్టింటి వద్దనే ఉంటుంది. ఈ నేపథ్యంలో భర్త నుంచి విడాకులు కోరుతూ సోమవారం లీగల్ నోటీసును నాగేంద్రకు పంపింది. విడాకుల నోటీసు అందుకున్న నాగేంద్ర తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఇంటి వద్ద మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. నాగేంద్ర మృతదేహన్ని చూసి తట్టుకోలేని తల్లి వెల్లటూరు నాగరాజకుమారి(55) ఉరివేసుకుని ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. రెండు రోజుల నుంచి ఇంటి తలుపులు తియ్యకపోవటంతో ఇంటి నుంచి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు బుధవారం ఉదయం ఇంటి తలుపులు తీసి పరిశీలించారు. నాగరాజకుమారి ఉరిపెట్టుకుని మృతి చెంది ఉన్నారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంటి దూలానికి వేలాడుతున్న నాగరాజకుమారి మృతదేహన్ని కిందకుదించారు. ఇంటి పక్కన సందులో నాగేంద్ర మృతదేహం ఉంది. ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు నాగేంద్ర చిన్నాన్న శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

చీట్ ఫండ్స్

(5వ పేజీ తరువాయి)

చిట్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు చేయాలి. అనుమతులు వచ్చాకే చిట్ నిర్వహించాలి. ఎంత చిట్‌ను నిర్వహిస్తే అంత మొత్తం డిపాజిట్.. లేదా బ్యాంక్ గ్యారంటీ దాఖలు చేయాలి. ప్రతి చిట్‌కు మూడు బ్యాంకు ఖాతాలను నిర్వహించాలి. చిట్ పొందిన సభ్యుడికి 25 రోజుల్లో బ్యాంకు ఖాతా ఒకటి నుంచి డబ్బు చెక్కు రూపంలో చెల్లించాలి. సభ్యుడు నిర్ణీత గడువులోపు డబ్బు స్వీకరించకపోతే ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంచాలి. ఏ నెలలో ఏ సభ్యుడు చిట్ పొందాడన్న వివరాలను చిట్ రిజిస్ట్రార్‌కు లిఖితపూర్వకంగా తెలియపరచాలి. ఒక నెలలో ఇందుకు సంబంధించిన సమాచారం ఇవ్వని పక్షంలో సదరు సంస్థపై చర్యలు తీసుకోవాలి. సభ్యుల నుంచి ఫిర్యాదులు లేని పక్షంలో డిపాజిట్ సొమ్మును చిట్ ముగిసిన తర్వాత సంస్థకు చెల్లించాలి. చిట్ సంస్థపై ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. లోపాలు ఉంటే చర్యలు తీసుకోవాలి. చిట్ సంస్థలపై రిజిస్ట్రేషన్‌శాఖలోని రిజిస్ట్రార్ పర్యవేక్షణ ఉండాలి. ప్రతి నెల సంస్థ సంబంధిత పత్రాలను దాఖలు చేస్తుందీ లేనిది పరిశీలించాలి. సభ్యులకు డబ్బు చెల్లింపులు ఎలా జరుగుతున్నాయన్న అంశాన్ని పరిశీలించాలి. అయితే ఈ నిబంధనలు ఏవీ ఎక్కడ కూడా అమలు కావడంలేదు. నరసరావుపేటలో ఓ చిట్ సంస్థ కాలపరిమితి పూర్తయిన మూడు నెలల వరకు సొమ్ము చెల్లించకపోవడంతో లేదు. వైద్యుడిగా ఉన్న ఆ సభ్యుడు చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినా సంస్థపై చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి.


సాయి సాధన చిట్ సంస్థ యజమాని పాలడుగు పుల్లారావు

భారీగా లాభాలు..

ప్రతి గ్రూప్ చిట్‌కు మొదటి నెల, మూడో నెల పాటను సంస్థ తీసుకుంటుంది. ప్రతి నెల 5 శాతం కమీషన్ వసూలు చేస్తోంది. ఉదాహరణకు 10 లక్షల చిట్‌కు రెండు నెలలకు రూ.20 లక్షలను సంస్థ తీసుకుంటుంది. ప్రతీ నెల కమీషన్ రూపంలో నెలకు రూ.50 వేలు వసూలు చేస్తుంది. రూ.10 లక్షల చిట్‌కు మొత్తంగా రూ.30 లక్షలు చిట్ సంస్థకు వస్తుంది. ఇంత భారీగా లాభాలు వస్తున్నాయి. ఒక సభ్యుడు 2వ నెల చిట్ పొందినట్లయితే ముగ్గురు వ్యక్తుల గ్యారంటీతో చిట్ సొమ్ము చెల్లిస్తారు. ఇక వేళ చిట్ తీసుకున్న సభ్యుడు నెలవారీగా సొమ్ము చెల్లించకుంటే గ్యారంటీ ఇచ్చిన వక్తుల నుంచి ఆ మొత్తాన్ని రాబట్టుకుంటారు. ఏ కోణంలో చూసినా చిట్ సంస్థకు నష్టాలు వచ్చే అవకాశం లేదు. అయినా రిజిష్టర్ పేరుతో అక్రమంగా చిట్లు నిర్వహిస్తూ మదుపరులను మోసగిస్తున్నారు. చిట్ సంస్థలు బోర్డు తిప్పేస్తుండటంతో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రేపటి నుంచి రంగస్థలి నాటిక పోటీలు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి, నరసరావుపేట రంగస్థలి సంయుక్త నిర్వహణలో రంగస్థలి 45వ వార్షికోత్సవం, 24వ జాతీయ ఆహ్వాన తెలుగు నాటక పోటీలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రకాశ్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా తొలిరోజు అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్రప్రస్థం, పండు క్రియేషన్స్, కొప్పోలు వారి పక్కింటి మొగుడు, వేసేయ్ లఘునాటిక ప్రదర్శించనున్నారు. రెండో రోజు కళాంజలి, హైదరాబాద్ వారి అన్నదాత, వెలవగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటికలు ప్రదర్శించనున్నారు. అనంతరం శ్రీకృష్ణరాయబారం (పడకసీను) పౌరాణిక నాటకం ప్రదర్శించనున్నారు. మూడో రోజు జీవీకే క్రియేషన్స్, కాకినాడ వారి తితిక్ష నాటిక, అమరావతి ఆర్ట్స్, గుంటూరు వారి చిగురు మేఘం నాటిక, భోషాణ రహస్యం నాటిక ప్రదర్శించనున్నారు.

143 జీవో రద్దుకు పోస్టుకార్డు ఉద్యమం


ముఖ్యమంత్రికి పోస్టు కార్డు రాసిన వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో అత్యంత వివాదాస్పదమైన 143 జీవో రద్దు కోరుతూ గుంటూరు జిల్లాలో ఉద్యమం ఆరంభం అయింది. గుంటూరు జిల్లా తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 143 జీవో రద్దు కోరుతూ బుధవారం పోస్టుకార్డు ఉద్యమం ప్రారంభించారు. తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాదల అప్పారావు ఆధ్వర్యంలో ఉద్యోగులు జీవో రద్దు కోరుతూ ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు రాశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అనాలోచితంగా తీసుకువచ్చిన 143 జీవో వలన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జీవోను రద్దు చేయాలని కోరారు. తెలుగునాడు వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే మెహబూబ్ సుభానీ, జిల్లా కార్యదర్శి టి.రామసీత, కోశాధికారి కోటేశ్వరమ్మ, సంయుక్త కార్యదర్శి నళిని, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.చినబ్రహ్మం, మన్నే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని యువకుడు ఆత్మహత్య

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం తాగి తిరుగుతున్నాడని కుమారుడిని తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని తురకపాలెం రోడ్డులో గల జన్మభూమి నగర్ మూడోలైన్‌కు చెందిన ధార ధనలక్ష్మి, భర్త సోమశేఖర్‌ల మధ్య మనస్పర్థలు వచ్చి కొద్ది సంవత్సరాలుగా వేరుగా ఉంటున్నారు. ధనలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో కలిసి జన్మభూమి నగర్ మూడో లైన్‌లో నివాసం ఉంటుంది. అయితే ఆమె రెండో కుమారుడైన పూర్ణకుమార్ (20) తాపీ పనులకు వెళ్తుంటాడు. నాలుగు రోజులుగా పనికి వెళ్లకుండా మద్యం తాగి తిరుగుతుండటంతో బుధవారం ఉదయం తల్లి మందలించింది. అనంతరం ఆమె, పెద్ద కుమారుడుతో కలిసి పనికి వెళ్లింది. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద ఉన్న రేకుల షెడ్‌లోని రాడ్డుకు పూర్ణకుమార్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125,134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

1,34,374 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,27,7981 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,34,374 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,103 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	9000	13500	334	9000	11500
నెంబరు. 5	9500	13000	నెంబరు.5	--	--
273	10000	12500	273	--	--
341	10000	14000	341	--	--
4884	9000	11500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	13300	13300
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	10000	12000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4500	7500	తెల్లకాయలు	4500	7500

విద్యుత్ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఉద్యమాలు

● జిల్లా కార్యదర్శి వరప్రసాద్

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) నిరంతరం ఉద్యమాలు చేసిందని యూనియన్ జిల్లా కార్యదర్శి ఎల్.వరప్రసాద్ తెలిపారు. ఏపీఈఈ యూనియన్ 76వ వసంతంలోకి వచ్చిన సందర్భంగా పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ ఎదుట యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏడున్నర దశాబ్ధాలుగా విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో అనేక పోరాటాలు చేసినట్లు గుర్తు చేశారు. గుంటూరు సర్కిల్ ఎస్ఏఓ పాశం రామిరెడ్డి, యూనియన్ సర్కిల్ యూనిట్ అధ్యక్షుడు జి భరత్ భూషణ్, కార్యదర్శి వి.నాగేశ్వరాచారి ఉన్నారు.

నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి కలెక్టరేట్‌లోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ మరింతగా పురోభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ జానీబాషా, సభ్యులు మహమద్ గనీ, బాషా, జపురుల్లా, అయూబ్, షాబుద్దీన్, రెహమన్, తాజుద్దీన్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.

గజేంద్రమోక్షంపై ఆధ్యాత్మిక ప్రవచనం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై సాహితీవేత్త పీఎస్ఆర్ ఆంజనేయప్రసాద్ జయంతి సందర్భంగా భాగవత రస ప్రవచన ప్రసంగ లహరిలో భాగంగా బుధవారం గజేంద్రమోక్షంపై ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సాహితీవేత్త ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి ప్రవచనం చేస్తూ ఏనుగు అంటే జీవుడని, జీవునికి కర్మబంధాలలో లభించే విడుదల గజేంద్రమోక్షమన్నారు. జీవుడు అహంకారం వదలిపెట్టి పరమాత్మను ఆశ్రయిస్తే ఆ అనుగ్రహం లభిస్తుందని, ఇదే గజేంద్రమోక్షం కథ సారాంశమని భగవత్ భక్తులకు సవివరంగా వివరించారు. కార్యక్రమాన్ని పి.రవికిషోర్, పి.హైమానంద పర్యవేక్షించారు.

ముగిసిన శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రెడ్డిపాలెంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ స్పిరిచ్యువల్, సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతోన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి 13వ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచే స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంటూరుతో పాటు పరిసర ప్రాంత ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఆలయంలో దంపతులతో సామూహిక కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ జరిగింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులున్నారు.

కాకతీయ కన్వెన్షన్ సొసైటీ కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గుంటూరులో కాకతీయ కన్వెన్షన్ సొసైటీ 2025-28 మూడేళ్లకు సంబంధించిన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా క్రొత్తపల్లి రమేష్ కృష్ణ చంద్ర, కార్యదర్శిగా ఘంటా పున్నారావు, కోశాధికారిగా ప్రత్తిపాటి సురేష్, ఉపాధ్యక్షుడిగా దామచర్ల శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా మాదాల చైతన్య, కమిటీ సభ్యులుగా కాట్రగడ్డ శ్యాంబాబు, పారా అశోక్, ఎన్వి రత్తయ్య, క్రొత్తపల్లి రవీంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీని సొసైటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ యర్రా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎన్నిక కార్యక్రమాన్ని గోరంట్ల పున్నయ్య చౌదరి పర్యవేక్షించారు. నూతన సొసైటీ అధ్యక్షుడు రమేష్ కృష్ణ చంద్ర మాట్లాడుతూ సొసైటీ సేవలను మరింతగా విస్తృతం చేస్తామని అన్నారు.

నేత్రపర్వంగా సత్యదేవుని నగరోత్సవం

గుంటూరు(తూర్పు) ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురంలో శ్రీ రమా సత్యనారాయణ స్వామి వారి 48వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నిత్య హోమం, బలిహరణ, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి మన్యు సూక్తంతో అభిషేకం, సింధూరార్చన విశేషంగా జరిపారు. సాయంత్రం సత్యదేవుని నగరోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. టీటీడీ విశ్రాంత విద్వాంసులు పారుపల్లి శ్రీరంగనాథ్ బృందంచే స్వరార్చన జరిపారు. కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ పర్యవేక్షించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద లారీ ఢీకొని మట్టి వీర వెంకట నరసింహారావు గాయపడ్డారు. చల్లావారిపాలెం గ్రామానికి చెందిన నర్సింహారావు ఆర్టీసీ బస్టాండ్‌లో బేకరీ నిర్వహిస్తుంటాడు. మంగళవారం అర్థరాత్రి బేకరీ పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా హౌసింగ్ బోర్డు కాలనీ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొట్టి వెళ్ళిపోయింది. గాయపడిన నరసింహారావును చికిత్స నిమిత్తం తరలించారు. ఆయన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీవోలు బాధ్యతగా విధులు నిర్వహించాలి

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్వో నాగలక్ష్మి



కలెక్టరేట్‌లో పీవోలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్ అధికారులు (పీవో)లు ఎలక్షన్ కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు ప్రకారం బాధ్యతగా విధులు నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో బుధవారం ఉదయం ప్రిసైడింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తహసీల్దార్లు, సెక్టార్ అధికారులకు, మధ్యాహ్నం అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆర్వో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికలు జరిగే ముందు రోజు ఈ నెల 26వ తేదీన ఏసీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఎన్నికల సామగ్రి స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ మెటీరియల్, బ్యాలెట్ బాక్సులు తీసుకొని వాటిని పూర్తిగా పరిశీలించుకొని పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓటింగ్ సమయం ముగిసేసరికి పోలింగ్ కేంద్రంలో ఉన్న వారందరికీ స్లిప్పులిచ్చి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు పూర్తిస్థాయిలో సీల్ వేసి స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారాలు సక్రమంగా పూర్తి చేసి ఏసీ కళాశాలలోని రిసెప్షన్ కేంద్రంలో భద్రంగా అందించాలన్నారు. సమావేశంలో ప్రిసైడింగ్ అధికారులకు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు నిర్వర్తించవలసిన విధులు, బ్యాలెట్ బాక్సులు ఓటింగ్‌కు సిద్ధం చేసే విధానం, సీల్ వేసే విధానంపై మాస్టర్ ట్రైనర్లు పవర్ పాయింట్, వీడియో చిత్రాల ద్వారా సమగ్రంగా శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి పాల్గొన్నారు.

ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు పోలింగ్ రోజున ఓటు వేయాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరిగా పీవోలకు చూపించాల్సి ఉంటుందని ఆర్వో నాగలక్ష్మి స్పష్టం చేశారు. ఎలక్టోరల్ ఫొటో గుర్తింపు కార్డు(ఈపీఐసీ) చూపిస్తే చాలన్నారు. ఈపీఐసీ లేని ఓటర్లు ప్రత్యామ్నాయంగా ఆధార్/డ్రైవింగ్ లైసెన్సు/పాన్/భారతీయ పాసుపోర్టు/కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ఇతర ప్రైవేటు పారిశ్రామిక సంస్థల ద్వారా ఉద్యోగులకు జారీ చేసిన గుర్తింపు కార్డులు చూపిస్తే సరిపోతుందన్నారు. అలానే ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, సంబంధిత ఉపాధ్యాయ/గ్రాడ్యుయేట్‌ల నియోజకవర్గానికి చెందిన ఓటర్లు ఉద్యోగంలో ఉన్న విద్యా సంస్థలు జారీ చేసిన సేవా గుర్తింపు కార్డు, యూనివర్శిటీ జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా సర్టిఫికేట్ ఒరిజినల్ కాపీ, కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఫిజికల్ హ్యాండీక్యాప్ సర్టిఫికేట్ ఒరిజినల్, ప్రత్యేక వైకల్యం ఐడీ(ఉదిద్)కార్డు చూపించినా ఓటు వేయడానికి పీవోలు అనుమతిస్తారని చెప్పారు.


మూడు వంతెనల వద్ద చివరి దశకు చేరిన బ్లాకుల అమరిక


లోపలి వైపు ప్లాస్టింగ్ చేస్తున్న తాపీ కార్మికులు

తుది దశకు ఆర్‌యూబీ పనులు

● రెండు వారాల్లో పూర్తి..
● రాకపోకలకు అనుమతి

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని డొంకరోడ్డు మూడొంతెనల వద్ద రైల్వే శాఖ నిర్మిస్తున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆర్‌యూబీ నిర్మాణంలో భాగంగా ప్రీకాస్టు ఆర్‌సీసీ బ్లాకుల అమర్చే ప్రక్రియ పూర్తవుతుందని, ఆ వెంటనే రోడ్డు లెవలింగ్ పనులు చేపడతామని రైల్వేవర్గాలు తెలిపాయి. క్లిష్టమైన డ్రెయినేజి మళ్లింపు పనులు కూడా శరవేగంగా పూర్తి చేస్తున్నామన్నాయి. భారీ వర్షం కురిసినా వరద నీరు ఆర్‌యూబీ కిందకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పాయి. పనులు మరో రెండు వారాల్లో పూర్తి చేసి వాహనాల రాకపోకలను అనుమతిస్తామని స్పష్టం చేశాయి.

ఇసుక సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలి : కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మైనింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీతో ఇసుక తవ్వకాలకు అనుమతులు ముగిసిన గుండిమెడ, మున్నంగి, బొమ్మువానిపాలెం 14, 15 రీచ్‌లలో నిల్వ ఉన్న 39,529 మెట్రిక్ టన్నుల ఇసుకను నిర్దేశిత మార్గదర్శకాలు ప్రకారం ప్రజలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుండిమెడ-2 ఓపెన్ ఇసుక రీచ్, బొమ్మువానిపాలెంలో పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే గతంలో నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం బిడ్డింగ్ ద్వారా ఏజెన్సీలను ఎంపిక చేయాలన్నారు. గ్రామం పరిధిలో నోటిపై చేసిన ఇసుక రీచ్‌లో నుంచి వ్యక్తిగత అవసరాలకు మాత్రమే ఎద్దుల బండ్లపై ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతి ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ ఏ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, జిల్లా మైన్స్, జియాలజీ అధికారి డీఎస్ వెంకటసాయి, జిల్లా ఉప రవాణా కమిషనర్ కె.సీతారామిరెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, తహసీల్దార్లు సిద్ధార్థ, డి.సీతారామయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి, రిజర్వ్ కన్జర్వేటివ్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమ్మక్క, సారక్క దేవస్థానంలో ఎమ్మెల్యే మాధవి పూజలు


సమ్మక్క, సారక్క దేవస్థానంలో ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 28వ డివిజన్ సీతమ్మ కాలనీలో ఉన్న సమ్మక - సారక్క దేవస్థానంలో బుధవారం ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమ్మక్క, సారక్కల కృప అందరిపై ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆమె కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావు యాదవ్, మామిడి రామారావు, కసుకుర్తి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమేరాలతో గస్తీ

● రేసులు, బహిరంగ మద్యపానంపై నిఘా


గుజ్జనగుండ్ల సెంటర్‌లో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమేరాలతో గస్తీ నిర్వహించే విధానాన్ని పోలీసులు ప్రారంభించారు. త్వరలోనే ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక్కో డ్రోన్ కెమేరాను ప్రభుత్వం కేటాయించనుంది. పోలీస్ సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని డ్రోన్ కెమేరాల ద్వారా గస్తీ నిర్వహించాలని నిర్ణయించారు. తద్వారా మద్యం తాగి వాహనాలు నడిపినా, స్నేక్ డ్రైవింగ్ చేసినా, రేసుల పేరుతో మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా, పెద్ద శబ్దాల సైలెన్సర్లతో వాహనాలు నడిపినా, వారి వాహన లైసెన్స్ రద్దు చేస్తామని పోలీస్ అధికారులు హెచ్చరించారు. బుధవారం గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, గంగాధర్, వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో స్పెషల్ ట్రాఫిక్ డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించక పోయినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా అపరాధ రుసుం విధిస్తామని వాహనదారులకు హెచ్చరికలు జారీ చేశారు. 50 ద్విచక్ర వాహనాలకు సుమారు రూ.60 వేలు అపరాధ రుసుంను విధించారు. అత్యధికంగా పెద్ద శబ్దం కలిగిన సైలెన్సర్‌ను బైక్‌కు అమర్చిన(లైసెన్స్ కూడా లేదు) వ్యక్తికి రూ.9,100 అపరాధ రుసుం విధించారు. ఈ డ్రైవ్‌లో ఆర్‌వో గంగాధర్, సీఐలు వీరేంద్రబాబు, వీరస్వామి, సింగయ్యలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం : డీపీటీవో

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) ఎం.రవికాంత్ తెలిపారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకొని ఎన్టీఆర్ బస్టాండ్‌లోని తిక్కన సమావేశ మందిరంలో బుధవారం పలువురు ఉద్యోగులు రక్తదానం చేశారు. డీపీటీవో మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తమ రక్తనమూనాలను తెలుసుకొని ఉండాలని, అవసరమైన సమయంలో ప్రాణదాతగా మారాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ కె.సురేష్‌కుమార్, ఆర్టీసీ డాక్టర్ సీహెచ్ విజయలక్ష్మి, గుంటూరు -1 , 2 డిపో మేనేజర్లు రామకృష్ణ, అబ్దుల్ సలాం తదితరులున్నారు.

జేఈఈ టాపర్ సాయిమనోజ్ఞకు అభినందనలు


సాయి మనోజ్ఞను అభినందిస్తున్న లిటిల్ ఫ్లవర్ ప్రిన్సిపాల్ శవిరి

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా టాపర్‌గా తమ స్కూల్ విద్యార్థిని సాయిమనోజ్ఞ నిలవడం గర్వకారణమని లిటిల్‌ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ శవిరి విద్యార్థిని బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ స్కూల్‌లో చదివిన విద్యార్థుల్లో అత్యధిక మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారన్నారు. సాయి మనోజ్ఞను ఆదర్శంగా తీసుకుని మిగిలిన వారు కూడా మరింత పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

అధ్యాపకుల మానసిక వికాసానికి క్రీడలు అవసరం

● జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్


క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న జాగర్లమూడి మురళీమోహన్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకుల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని జేకేసీ కళాశాల కార్యదర్శి జాగర్లమూడి మురళీమోహన్ అన్నారు. కళాశాల గ్రౌండ్‌లో చందూస్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకుల కోసం ఏటా కళాశాల ఆధ్వర్యంలో పోటీలు నిర్వస్తున్నామని వివరించారు. కళాశాల వ్యవస్థాపకులు జాగర్లమూడి చంద్రమౌళి మనుమడు చంద్రమౌళి పేరుతో చందూస్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకుల నుంచి భారీ స్పందన లభించడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి గోపిచంద్, డాక్టర్ కొండబోలు సాంబశివరావు, శరణు రామకృష్ణప్రసాద్, జేకేసీ న్యాయ కళాశాల అధ్యాపకులు సిహెచ్ సుధాకర్ పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు...వచ్చేది మనమే

● జిల్లా నేతలతో వైసీపీ అధినేత జగన్

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎవరూ అధైర్యపడొద్దు...వచ్చే ఎన్నికల్లో మనమే అధికారంలోకి వస్తున్నాం అంటూ వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి జిల్లా నేతలకు భరోసా ఇచ్చారు. వైసీపీ అధినేత జగన్ తాడేపల్లిలోని కార్యాలయంలో బుధవారం ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశం నిర్వహించారు. మనం ఎన్నికల ప్రచారంలో అబద్ధపు హామీలు చెప్పకపోవటంతోనే ఓటమి చవిచూశామన్నారు. ఎన్నికల్లో అబద్ధపు హామీలతో కూటమి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా వైసీపీ గెలుస్తుందని, మరో 30 ఏళ్ళ పాటు అధికారంలో కొనసాగటం ఖాయమని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, జిల్లా నేతలు ఎంపీ ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజనీ, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, అన్నాబత్తుని శివకుమార్, కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌ఛార్జ్‌లు దొంతిరెడ్డి వేమారెడ్డి(మంగళగిరి), డైమండ్‌బాబు (తాడికొండ), అంబటి మురళీ (పొన్నూరు), షేక్ నూరిఫాతిమా (గుంటూరు తూర్పు) పలువురు నాయకులున్నారు.


గుంటూరులో బుధవారం ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యేలు మొహమ్మద్ నసీర్, గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, కోవెలమూడి రవీంద్ర, కార్పొరేషన్ల చైర్మన్లు దేగల ప్రభాకర్, మన్నవ మోహనకృష్ణ, ఉండవల్లి శ్రీదేవి - గుంటూరు (ఆంధ్రజ్యోతి)


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఏ.భార్గవ్‌తేజ

ఎక్స్ పీరియన్షియల్ లెర్నింగ్‌తో యువతకు సువర్ణ అవకాశం

● జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎక్స్ పీరియన్షియల్ లెర్నింగ్ కార్యక్రమం యువతకు సువర్ణ అవకాశం అని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ అన్నారు. ఎక్స్ పీరియన్షియల్ లెర్నింగ్ కార్యక్రమం ఏర్పాట్లపై బుధవారం జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ వివిధ అధికారులతో సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ మాట్లాడుతూ వ్యవసాయ, నాబార్డ్, లీడ్ బ్యాంకు, ఆరోగ్య, డీఆర్డీఏ డిపార్టుమెంట్లను ముందుగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్టర్ అయ్యి, ఆయా శాఖల ద్వారా కనీసం 20 మంది యువతకు 120 గంటలు ఎక్స్ పీరియన్షియల్ లెర్నింగ్ ప్రోగ్రాం అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమీక్షలో గుంటూరు నెహ్రూ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, డీఎం హెచ్ఓ డాక్టర్ కె విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ టీవి విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ కె శ్రీహరి, ఆర్టీవో బి.సత్యనారాయణ ప్రసాద్, జిల్లా టూరిజం శాఖాధికారి ఏ.శ్రీరమ్య, జిల్లా ఇండస్ట్రియల్ సెంటర్, జిల్లా మేనేజర్ ఈ.జయ లక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి ఎన్.వెంకటేశ్వర్లు, పోలీస్ శాఖ నుంచి డీఎస్పీ బీవీ సుబ్బారావు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆర్.మహిపాల్‌రెడ్డి, నాబార్డ్ ఏజీఎం జి.శరత్ బాబు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, యూనివర్సల్ కాలేజ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో మార్పు రావాలి

● నూరు శాతం ఇంటింటా చెత్త సేకరణ జరగాలి
● కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య పనుల్లో మార్పు రావాలని, వార్డు సచివాలయం వారీగా నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ, డ్రెయిన్ల శుభ్రం తప్పనిసరిగా జరగాలని, ఇప్పటికే పారిశుధ్య పనులపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులు, కార్యదర్శులతో పారిశుధ్య పనులు, ట్రేడ్ లైసెన్స్‌లపై బుధవారం సమావేశం నిర్వహించారు.

కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు బాధ్యత వహించాలన్నారు. ఇప్పటికే ప్రజల నుంచి పారిశుధ్య పనులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మెరుగైన పారిశుధ్యం కోసం కృషి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. నగరంలో ట్రేడ్ లైసెన్సులు ఉండాల్సిన సంఖ్య కన్నా తక్కువగా ఉన్నాయని, ఈనెల 15లోపు వార్డు సచివాలయాల వారీగా ట్రేడ్ లైసెన్స్‌లపై సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. నగరంలో ట్రేడ్ లేకుండా కమర్షియల్ సంస్థలు ఉండడానికి వీలులేదని, పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ట్రేడ్ లేని సంస్థలకు చట్టప్రకారం నోటీసులు అందించి, స్పందించని వాటిని సీజ్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సీఎంఓహెచ్ఓ డాక్టర్ పిజె అమృతం, ఎంహెచ్ఓ రవిబాబు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, వెటర్నరీ సర్జన్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు ఆయుబ్ ఖాన్, సోమశేఖర్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ లేదు : కమిషనర్

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ రాయితీ లేనందున 2024-25 రెండో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్నులు చెల్లించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటన ద్వారా కోరారు. ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ లేనందున బకాయిదార్లు మార్చి వరకు వేచి ఉండకుండా చెల్లించాలని, ఏప్రిల్ 1 నుంచి పన్నుపై వడ్డీ జమ అవుతుందన్నారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించడానికి ఫిబ్రవరి నెలాఖరు చివరి తేదీ కనుక సదరు ఫీజులు కూడా సకాలంలో చెల్లించాలన్నారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.


ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తా

● పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు


ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ సభ్యులను ఓటు అభ్యర్థిస్తున్న లక్ష్మణరావు


గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉదయం గుజ్జనగుండ్ల, ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌ను కలిసి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటివరకు నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నామని, రానున్న రోజుల్లో కూడా ఆ విధమైన పాత్ర పోషించడం కోసం తనను ఎన్నుకోవాలని కోరారు. రైతాంగం, విద్యావంతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, అన్ని రకాల ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్షుడు యు రాజశేఖర్, జిల్లా సహాధ్యక్షురాలు నాగమణి, మధ్య తరగతి ఉద్యోగుల ఫోరం నాయకులు వీవీకే సురేష్, ఎల్ఎస్ భారవి, డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎం.సూర్యారావు సీఐటీయూ జిల్లా నాయకులు కే.నళినీకాంత్, బి.ముత్యాలరావు, బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆధ్యాత్మికవేత్త సంతు రవిదాస్ జయంతి


సంతు రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : దళిత హైందవ గురువు, ఆధ్యాత్మిక వేత్త సంతు రవిదాస్ 648వ జయంతి బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వహకులు ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ దర్శనపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే రామాంజనేయులు సంతు రవిదాసు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఉత్తర భారత దేశంలో కోట్లాదిమంది భక్తులు సంతు రవిదాస్‌ను పూజిస్తారన్నారు. ఆనాడు అంటరానితనానికి వ్యతిరేకంగా మొట్టమొదట ఉద్యమించిన వ్యక్తి రవిదాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ పెద్దలు పృధ్వి రాజు, కృష్ణ మోహన్, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు రమణమూర్తి, టీడీపీ నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, కల్లూరు శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు కొత్తూరు సుబ్బారావు, బీజేపీ రూరల్ మండల అధ్యక్షుడు రాజేష్, కన్నా రవితేజ రాజు, జనసేన నేత కొర్రపాటి నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నేతలు కూచిపూడి సత్యం, దున్న సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు సుధీర్‌తో పాటు పలువురు సంతు రవిదాస్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని తెప్పోత్సవం


శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

తాడేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్ల తెప్పోత్సవాన్ని బుధవారం కృష్ణానదిలో వైభవంగా నిర్వహించారు. తొలుత మంగళగిరి నుంచి స్వామివార్లను తాడేపల్లిలోని శ్రీమద్వి రాంజనేయస్వామి ఆలయానికి తీసుకురాగా, అర్చకులు దివి అనంత పద్మనాభాచార్యులు, మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, స్థానిక అర్చకులు వైకానస ఆగమాను సారంగా విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం మధ్యా హ్నం దేవస్థానం నుంచి స్వామి వారు ఊరేగింపుగా కృష్ణానది వరకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యే కంగా అలంకరించిన పంట్‌పై స్వామివార్లను అధిష్టంపజేసి శోభాయమానంగా అలంకరించారు. బంగారు గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన నృసిం హుడిని భక్తులు దర్శించుకున్నారు. ఉండవల్లి కరకట్ట నుంచి ప్రారంభమైన తెప్పోత్సవం విజయవాడ దుర్గా ఘాట్ వరకు వె ళ్లి తిరిగి కరకట్టను చేరుకుంది. అనంతరం స్వామివార్లను ప్రత్యేక వాహనంలో మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయా నికి చేర్చారు. మంగళాద్రి దేవస్థానం ఏసీ అండ్ ఈవో అన్నప రెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. కైంకర్యపరులుగా పెదపా లెంకు చెందిన పెమ్మసాని శైలేంద్ర తదితరులు వ్యవహరించారు.

ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన 60 మంది ట్రైనీ జడ్జీలు

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 60 మంది ట్రైనీ జూనియర్ సివిల్ జడ్జీలు తమ శిక్షణలో భాగంగా పలు రకాల మెడికో లీగల్ కేసులపై అధ్యయనం చేసేందుకు బుధవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిని సందర్శించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్వీ రమణ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ట్రైనీ జడ్జీలకు ఎమ్మెల్సీ కేసుల్లో పలు అంశాలను వివరించారు. ట్రామా, ఎమర్జెన్సీ విభాగంలో రోడ్డు ప్రమాద కేసుల పూర్వాపరాలను ఎమర్జెన్సీ వైద్య విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధిక రాణి వివరించారు. ఆర్థోపెడిక్ విభాగంలో చికిత్సలకు వచ్చే పలు ఎమ్మెల్సీ కేసుల వివరాలను అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య వివరించారు. మెడికల్ రికార్డు ఆఫీసర్ రామారావు, ఆసుపత్రికి వచ్చే పలు రకాల కేసులకు సంబంధించి వివరాలు, ఎమ్మెల్సీ కేసు షీట్లను భద్రపర్చే విధానాలను ట్రైనీ జడ్జీలకు వివరించారు. అనంతరం మార్చురీలో మృతదేహాలకు పోస్ట్ మార్టమ్ ప్రక్రియను తిలకించారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం నిపుణులు డాక్టర్ జాఫర్ ఆయా ఎమ్మెల్సీ కేసుల్లో ఎదురయ్యే న్యాయపరమైన అంశాలను ట్రైనీ జడ్జీలకు వివరించారు.


ట్రైనీ జడ్జీలతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ రమణ

జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో...
వీఎంయూల ఏర్పాటు

● సెక్టోరల్ ప్రణాళికలను ఇవి పర్యవేక్షిస్తాయి
● సెక్రటరీల సమావేశంలో ప్రభుత్వం ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047లో భాగంగా జిల్లా, నియోజక వర్గ స్థాయిల్లో విజన్ మానిటరింగ్ యూనిట్ (వీఎంయూ)ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. సెక్టోరల్ ప్రణాళికల అమలు, సమన్వయం, పర్యవేక్షణ కోసం వీటిని నెలకొల్పనున్నట్లు పేర్కొన్నది. జిల్లాస్థాయి అధికారులకు సామర్థ్యాన్ని పెంచడం, మార్గదర్శకం చేయడం వంటివి చేపట్టనున్నట్లు ప్రకటించింది. అమరా వతి రాజధానిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరుగు తున్న సెక్రటరీలు, మంత్రుల సమావేశంలో ఈ నిర్ణయాన్ని తీసుకొన్నారు. ఏవైతే త్వరగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉన్నదో అలాంటి ప్రాజెక్టులను గుర్తించా లని జిల్లా అధికారులను ఆదేశించారు. మండల, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కేపీఐ(కీ పెర్‌ఫార్మెన్స్ ఇండికేటర్)లను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా పోర్టల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్‌ని అమలు వేగాన్ని పెంచేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బందిని డిప్యూటేషన్ చేయాలని సూచించారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ఐదుగురు, నియోజకవర్గ స్థాయిలో ఆరుగురు చొప్పున డిప్యూటేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయంలో 16.02, పరిశ్రమల్లో 17, సర్వీసు సెక్టార్‌లో 16.25, జీవీఏ 16.34, జీఎస్‌డీపీ 16.16, తలసరి ఆదాయం 15.76 శాతం వృద్ధి చెందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తలసరి ఆదాయం రూ. 2,66,653 ఉండగా ఇది రూ. 3,11,004 పెరిగేలా చూడాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు 18,230 ఫిర్యాదులు వివిధ శాఖలకు చెందినవి అందాయి. ముఖ్యమంత్రి, సీఎంవోకు అందిన ఫిర్యాదుల్లో గుంటూరు 1,142తో మూడో స్థానంలో ఉన్నది. ఈ ఫిర్యాదుల సంఖ్యని తగ్గించాలని ఆదేశించారు. వాట్సాప్ గవర్నెన్స్‌ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలను ఈ వారంలోనే జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు సంబంధిత సెక్రటరీలు తెలియజేయనున్నారు.

గడువులోపే రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి

● గుంటూరు రైల్వే డివిజన్ ఇన్‌స్పెక్షన్‌లో జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పథకం కింద గుంటూరు రైల్వే డివిజన్‌కు మంజూరు చేసిన స్టేషన్ల అన్నింటిలో నిర్ణీత గడువు తేదీ లోపు పనులు పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన బుధవారం ఉదయం గుంటూరు నుంచి పగిడిపల్లి రైల్వేస్టేషన్ వరకు సెక్షన్ మొత్తం ఇన్‌స్పెక్షన్ చేశారు. జోనల్ ఉన్నతాధికారులు, గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, ఇతర సీనియర్ అధికారులతో కలిసి ఆయన పరిశీలన జరిపారు. తొలుత గుంటూరు రైల్వేస్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ఏరియా, ప్లాట్‌ఫాంలు, కంబైన్డ్ క్రూ లాబీ, టిక్కెట్ కౌంటర్‌లు, ఏటీవీఎం యంత్రాల పనితీరుని పరిశీలించారు. క్రూ లాబీలో లోకోపైలట్లు, అసిస్టెంట్ లోకోపైలట్లు విశ్రాంతి తీసుకునేలా సకల సదుపాయాలు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగుల రన్నింగ్‌రూంని కూడా జీఎం సందర్శించారు. ఫుడ్ స్టాల్స్‌లో గడువు తేదీ దాటిపోయిన వాటిని విక్ర యించకుండా చూడాలని డీఆర్ఎంని ఆదేశించారు. గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపున అభివృద్ధి చేస్తున్న సర్క్యులేటింగ్ ఏరియాని అధునాతనంగా తీర్చిదిద్దాలన్నారు.

గుంటూరు రైల్వేస్టేషన్ తనిఖీ అనంతరం ఆయన ఇన్‌స్పెక్షన్ కార్ బ్యాక్‌విండో(వెనక కిటికీ) నుంచి రైలుమార్గాన్ని పరిశీలించారు. సెక్షన్ గరిష్ఠ వేగాన్ని కూడా ఈ సందర్భంగా టెస్టింగ్ చేశారు. నల్లపాడు రైల్వేస్టేషన్‌లో పాదచారుల వంతెనని పరిశీలించి రన్నింగ్ రూంలను తనిఖీ చేశారు. లోకోపైలట్లు, గా ర్డులతో సంభాషించి అక్కడ లభిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఫిర్యాదు రిజిష్టర్‌లో నమోదైన కంప్లయింట్‌లు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం నల్లపాడు - పిడుగురాళ్ల సెక్షన్‌ని తనిఖీ చేశారు. పొందుగల వద్ద కృష్ణానదిపై ఉన్న వంతెన పటిష్టతని పరిశీలించారు. క్రమం తప్పకుండా ఈ బ్రిడ్జిని మెయిన్‌టెనెన్స్ చేస్తుండాలని సూచించారు. అక్కడి నుంచి విష్ణుపురం, మిర్యాలగూడ రైల్వేస్టేషన్లను వెళ్లి అక్కడ తనిఖీలు చేపట్టారు. అమృత్ భారత్ స్టేషన్ కింద మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనులు, విస్తరణ ప్రణాళికలను సమీక్షించారు. నిర్దేశిత గడువు లోపు పనులు పూర్తి చేయాలని డీఆర్ఎంని ఆదేశించారు. అనంతరం రాయనపాడు - తిప్పర్తి రైల్వేస్టేషన్ల మధ్యన ఉన్న లెవల్‌క్రాసింగ్ గేటు నంబరు. 54ని తనిఖీ చేసి అక్కడ విధి నిర్వహణలో ఉన్న గేట్‌మ్యాన్‌తో సంభాషించారు. అత్యవసర పరిస్థితుల్లో విధుల నిర్వహణపై గేట్‌మ్యాన్‌కు ఉన్న జ్ఞానం, భద్రత విధానాలను అడిగి తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు.

చివరగా నల్గొండ రైల్వేస్టేషన్‌ని తనిఖీ చేసి ప్రయాణికులకు లభిస్తున్న సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా, ఎఫ్‌వోబీ, స్టేషన్‌మాష్టరు గదిని పరిశీలించారు. అలానే మార్గమధ్యలో ఉన్న చిన్న వంతెనల వద్ద కూడా జీఎం ఆగి వాటి పటిష్టతని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే కార్మిక సంఘాల నాయకులను జీఎం కలుసుకుని వినతిపత్రాలు స్వీకరించారు. అలానే ప్రజాప్రతినిధులతో రైల్వేస్టేషన్ల అభివృద్ధి గురించి చర్చించారు. ఇన్‌స్పెక్షన్‌లో డీఆర్ఎంతో పాటు గుంటూరు రైల్వే డివిజన్ నుంచి సీనియర్ అధికారులు జేవీ అనూష, డాక్టర్ ప్రదీప్‌కుమార్, దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు మీదగా నాలుగు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా నాలుగు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు గుంటూ రు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు ఈ నెల 14, 21 తేదీల్లో రాత్రి 7.20కి బయలుదేరి సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 4.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16, 23 తే దీల్లో సాయంత్రం 6.55కి బయలు దేరి గుంటూరు, సత్తెనపల్లి మీదగా మ రుసటి రోజు ఉదయం 6.50కి చర్లపల్లి చేరు కొంటుంది. నంబరు. 07233 చర్లపల్లి - నరసపూర్ స్పెషల్ ట్రైన్ ఈ నెల 14, 21 తేదీల్లో రాత్రి 7.15కి బ యలుదేరి మరుసటి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు వేకువజామున 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07234 నరసపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 16, 23 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీద గా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకుంటుందన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రభంజనం


విద్యార్థులతో డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలో విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల సమన్వయకర్త జి.శ్రీకూర్మనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని ఇంటర్ కళాశాలలో విద్యార్థులతో ఆయన అభినందన సభ నిర్వహించారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన వై. విష్ణు కార్తీక్ (99.45), ఆర్. శ్రీకాంత్ (98.38), కె విష్ణువర్ధన్ (96.78), ఎస్. ప్రేమ్ కుమార్ (96.33), ఏస్ డీ అర్షాద్ (96.29), బాషా (96.13), ఉమేష్ నారాయణ్ (95.92), వీ. కౌశిక్ (93.47), గౌతం రెడ్డి (93.28), నాగ జస్వంత్ (91.18), అవినాష్ (91.08), ఉమేష్ చౌదరి(90.50), రిక్విత్ (90.03) పర్సంటైల్‌తో ప్రభంజనం సృష్టించారని సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలి పారు. 25 శాతం మంది విద్యార్థులు 90 శాతంకు పైగా పర్సంటైల్ సాధించారని వెల్లడించారు. ప్రిన్సిపాల్ జె. మోహన్ రావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

మిర్చి విదేశీ ఎగుమతిదారుల
రహస్య సమావేశం

● ధర తక్కువగా ఉన్నప్పుడే అక్కడి దిగుమతిదారులతో ఒప్పందాలు ● ఆ రేటుకే యార్డులో కొనుగోలు చేయాలని నిర్ణయం
● అందుకే మార్కెట్ పెరగడం లేదని కమీషన్ వ్యాపారస్థుల సందేహం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు మిర్చిని ఎగుమతి చేసే కొంతమంది వ్యాపారస్థులు రెండు రోజుల క్రితం రహస్యంగా ఒక స్టార్‌హోటల్‌లో సమావేశమైనట్లు మిర్చియార్డులో విస్తృతంగా చర్చ జరుగుతున్నది. గత ఏడాది కంటే ప్రస్తుత మిర్చి సీజన్‌లో ఎక్స్‌పోర్టు వెరైటీల ధర పడిపోవడం, రైతుల ఆందోళనలు, ప్రభుత్వ స్థాయిలో సమీక్షలు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం సంతరించుకొన్నది. విదేశాలకు ఎగుమతి చేసే ఎక్స్‌పోర్టర్లు ధర పెంచితేనే మార్కెట్ పెరుగుతుంది. లేకుంటే ప్రస్తుతం ఉన్న ధరల్లో ఎలాంటి వ్యత్యాసం ఉండదు. అయితే తక్కువ ధరకే మిర్చిని పంపుతామని వివిధ దేశాల నుంచి ముందుగానే ఆర్డర్స్ తీసుకొని కొంతమేరకు ఈ ఎక్స్‌పోర్టర్లు అడ్వాన్స్‌లు కూడా పొందారన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పుడు రేటు పెరిగితే విదేశీ ఎగుమతిదారులకు లాభాలు రాకపోగా నష్టాలు వచ్చే పరిస్థితి ఉండటంతో అంతా ఒక మాట మీద నిలబడి ధర పెరగకుండా చూడాలన్న నిర్ణయానికి వచ్చినట్లు కమీషన్ వ్యాపారస్థులు సందేహిస్తున్నారు.

గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) నుంచి ఏటా చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, ఇండోనేషియా వంటి దేశాలకు మిర్చి ఎగమతులు జరుగుతుంటాయి. అయితే ఎక్స్‌పోర్టర్లలో కొంతమందే ఆయా దేశాల్లోని దిగుమతిదారులతో ఒప్పందాలు చేసుకొంటారు. మిగతా ఎగుమతిదారులు దేశీయంగానే వివిధ రాష్ట్రాల నుంచి ఆర్డర్స్ తీసుకొని మిర్చిని సరఫరా చేస్తుంటారు. మిర్చియార్డులో తేజ, బ్యాడిగి, దేవనూరు డీలక్స్ వంటి వెరైటీల మిర్చి ధర పెరగాలంటే విదేశీ ఎగుమతులే కీలకం. చైనాకు సీజన్‌లో ప్రతీ నెలా వెయ్యి కంటైనర్ల వరకు మిర్చి ఎగుమతి జరుగుతుంటుంది. అలానే శ్రీలంకకు 150 కంటైన్ల వరకు ఎక్స్‌పోర్టు జరుగుతుంది. బంగ్లాదేశ్‌కు లారీల ద్వారా సరుకు వెళుతుంటుంది. కాగా గత ఏడాది ఆగస్టు నెల తర్వాత మిర్చి ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత సీజన్‌లో నాణ్యమైన మిరపకాయలను రైతులు తీసుకొస్తున్నప్పటికీ విదేశీ ఎగుమతిదారుల నుంచి పెద్దగా స్పందన ఉండటం లేదు. ఎంతసేపటికీ క్వింటాల్ రూ. 11 వేల నుంచి రూ. 12 వేలకే కొనుగోలు చేయడానికి వేలం సమయంలో ధర ప్రతి పాదిస్తున్నారు. ఇందుకు కారణం విదేశాలకు చెందిన దిగుమతి దారులతో తక్కువ ధరకే మిర్చి సరఫరా చేస్తామని ముందుగానే ఒప్పందాలు చేసుకొన్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. అదే ఇప్పుడు ధర పెరిగితే ఆయా దేశాల్లోని వ్యాపారస్థులతో చేసుకొన్న ఒప్పందం మేరకు మిర్చిని సరఫరా చేయలేరు. ఈ కారణంగానే ఎక్స్‌పోర్టర్లు ధర పెంచడం లేదని కమీషన్ వ్యాపారస్థులు భావిస్తున్నారు.

ప్రస్తుతం కోల్డ్‌స్టోరేజ్‌లలో 80 శాతం ఖాళీగా ఉన్నాయి. వాటిల్లో నిల్వలు ఎక్కువగా ఉంటే మార్కెట్‌లో ధర పెరగదు. అలాంటిది శీతల గిడ్డంగుల్లో నిల్వలు పెద్దగా లేకపోయినా ధర పెరగడం లేదు. మిర్చియార్డుకు వచ్చే వారిలో చాలామంది చిన్న, సన్నకారు రైతులే. రెండు నుంచి నాలుగైదు ఎకరాలు సాగు చేసి పండించిన మిర్చిని వెనువెంటనే విక్రయించుకోవాలని చూస్తుంటారు. శీతల గిడ్డంగుల్లో స్టాకు పెట్టుకొని ధర పెరిగినప్పుడు విక్రయించొచ్చులే అని ఎదురు చూసే పెద్దరైతులు చాలా తక్కువ సంఖ్యలో ఉంటారు. ఈ నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకొని ధర పెరగకుండా చూస్తే గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ ధరకే అమ్మేలా చేస్తున్నారన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఈ సిండికేట్‌ని ప్రభుత్వం విచ్ఛిన్నం చేయగలిగితేనే రైతులకు కనీసం నష్టం లేకుండా మిర్చియార్డులో ధర లభిస్తుందన్న అభిప్రాయం వివిధ వర్గాల ద్వారా వ్యక్తమౌతున్నది.

పరీక్ష టేబుళ్లను ప్రారంభించిన డాక్టర్ లక్ష్మీరజని

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, పీజీ విద్యార్థుల సౌకర్యార్థం విరాళంగా అందజేసిన ఎగ్జామ్ టేబుళ్ళు చైర్లను దాత డాక్టర్ నర్రంనేని లక్ష్మీరజని బుధవారం ప్రారంభించారు. జీఎంసీ 1998వ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ లక్ష్మీరజని, రూ.10 లక్షలతో ఈ టేబుళ్లను, కుర్చీలను విరాళంగా కాలేజీకి అందజేశారు. దివంగతులైన తన తండ్రి నర్రంనేని లక్ష్మీనారాయణ స్మారకార్థం ఈ విరాళం ఆమె అందజేశారు. బుధవారం కళాశా లలో జరిగిన కార్యక్రమంలో వీటిని ప్రారంభించి, శిలాఫలకం ఆమె ఆవిష్క రించారు. కార్యక్రమంలో జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ సుందరాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ఉపసంహరణ గడువు ముగింపు

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుంది. నేటి సాయంత్రం 3 గంటల వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉందని రిటర్నింగ్ అధికారి కార్యాలయ వర్గాలు తెలిపాయి. అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నాయి. ప్రస్తుతం 30 మంది అభ్యర్థులు బరిలో కొనసాగుతున్నారు.

జిందాల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించిన పీఆర్ కమిషనర్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలంలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్‌ను రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ వీఆర్ కృష్ణ తేజ బుధవారం పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన ఘన వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే ప్రక్రియపై ఆరాతీశారు. గుంటూరుతో పాటు, చుట్టుపక్కల ఉన్న మునిసిపాలిటీల నుంచి రోజుకు 1200 టన్నుల ఘన వ్యర్థాలను సేకరించి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని సంస్థ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, గుంటూరు జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయికుమార్, పల్నాడు డీపీవో భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్ మెంట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఆర్ కమిషనర్ కృష్ణ తేజ

సీఎంఏ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రభంజనం


ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అన్నా నందకిషోర్ తదితరులు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించారని చైర్మన్ అన్నా నందకిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఏ ఫైనల్‌లో షేక్ మొహమ్మద్ ఆలీ 18వర్యాంకు, సీఎంఏ ఇంటర్‌లో కే యోగితారెడ్డి 27వర్యాంకు సాధించినట్లు, జీ రామ్‌చరణ్‌తేజ 442 మార్కులు, డీ వెంకటరామిరెడ్డి 437, ఎం మోక్షిత 431, జీ స్వాతి 430 మార్కులు సాధించారన్నారు. ఇంటర్ నుంచి సీఏ,సీఎంఏ కోర్సులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో క్రమశిక్షణతో కూడిన కోచింగ్ అందిస్తున్నామన్నారు. విద్యార్థులను సంస్థ డైరెక్టర్ అన్నా శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

527 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం
కేసు నమోదు చేసిన అధికారులు

నూజెండ్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్త నాగిరెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకుని 6(ఏ) కేసు నమోదు చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన, ఆటలో తీసుకు వచ్చిన రెండు వందల 264.20 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వినుకొండలోని సివిల్ సప్లయిస్ గోదాములకు తరలించి విచారణ చేస్తున్నట్టు తహసీల్దార్ జీ రమేష్ కుమార్ తెలిపారు. పెద్దసంఖ్యలో రేషన్ బియ్యం నిల్వలు ఉండటంతో ఇన్‌చార్జ్ డీఎస్‌వో సుశీల రైస్ మిల్లును సందర్శించి తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, వీఆర్‌వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారి ఇన్‌చార్జ్ డీఎస్‌వో సుశీల తదితరులు

పల్నాడులో లెదర్‌పార్కు

మాచర్ల రూరల్, నకరికల్లు, వినుకొండటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ప్రభుత్వం లెదరు పార్కు ఏర్పాటు దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో అనువైన ప్రదేశాలను పరిశీలిస్తుంది. అందులో భాగంగా బుధవారం మాచర్ల, నకరికల్లు, వినుకొండ ప్రాంతాల్లో కొరియా నిపుణులు స్థల పరిశీలన చేశారు. ఆయా ప్రాంతాల్లోని స్థలాలకు చేరుకుని మ్యాప్‌లను పరిశీలించారు. నీటివసతి, నేషనల్ హైవే నుంచి దూరం, విద్యుత్, భూమి స్వభావం తదితర వసతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మాచర్ల మండల పరిధిలోని రాయవరంలో ఏపీఐఐసీకి కేటాయించిన సర్వే నంబరు 795బై3లో 151 ఎకరాలు, కొత్తపల్లిలో ఏపీఐఐసీకి కేటాయించిన సర్వే నంబరు 67 బై5లో 450 ఎకరాల భూములను పరిశీలించారు.


కొత్తపల్లిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కొరియా నిపుణులు, అధికారులు

- వినుకొండ మండలం వెంకుపాలెం కురవ వద్ద ఉన్న సర్వే నెం.1లోని 98 ఎకరాల్లోని ప్రభుత్వ భూమిని ఈ బృందం పరిశీలిం చింది. భూమి స్థితిగతులు, కొండ నీరు పోయే మార్గంతో పాటు పరిశ్రమకు అనువైన స్థితిగతుల గురించి అధికారులను అడిగి కొరియా నిపుణులు తెలుసుకున్నారు. దొనకొండలో విమానాశ్రయంతో పాటు, కేవలం 7 కిలోమీటర్ల దూరంలో రైల్వేస్టేషన్ ఉందని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కంపెనీ ప్రతినిధులకు తెలిపారు.
- నకరికల్లు మండలం యంగ్‌బుల్ రేరింగ్ సెంటర్(పూర్వపు బీబీసీ)కి చెందిన భూములను కొరియా ప్రతినిధులు పరిశీలించారు. 530 ఎకరాల భూమి ఉండగా వివిధ కేటాయింపులకు పోగా ప్రస్తుతం 50 ఎకరాలు మాత్రం పూర్తి స్థాయిలో అందుబాటులో ఉందని, మరో 25 ఎకరాలు ఇండో ఇజ్రాయేలు ప్రాజెక్టులో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు కేటాయించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కొరియా దేశానికి చెందిన సీఈవో బాబుషారూక్, కేవైలి, లోకేషన్, వాసులతో పాటు ప్రభుత్వం తరఫున కే రంజిత్, ఆర్డీవోలు మధులత, మురళీకృష్ణ, డీఆర్‌వో మురళి, సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్లు కే పుల్లారావు, కిరణ్‌కుమార్, సురేష్, పరిశ్రమల జీఎం సుధాకర్, జిల్లా సర్వేయర్ శేషగిరిరావు, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, మండల సర్వేయర్లు వెంకటేశ్వర్లు, రఘుపతి, చండీరాణి, వినుకొండ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, నాయకులు నాగశ్రీను, లెనిన్, జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

537 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఫిబ్రవరి 12: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 103 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 7,400 గరిష్ఠ ధర రూ. 10,400 మోడల్ ధర రూ.10,400 పలికాయి. కాయ విక్రయాలు జరుగలేదు.

చివరి భూములకు అందని సాగునీరు

- వంకాయలపాటి మేజర్‌కు దిగువకు రాని వైనం
- పై ప్రాంతంలోనే నీటి ప్రవాహనికి అడ్డుకట్ట
- నీరు అందకుంటే పైర్లు దెబ్బతినే ప్రమాదం
- వారం రోజులుగా కాలువలపై కాపలాగా రైతులు


నీరు లేక వడబడి పోతున్న పొగ తోట

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఆయకట్టుకు చివర ప్రత్తిపాడు ప్రాంతంలోని భూములను సాగునీటి సమస్య వెంటాడుతూనేవుంది. గతంలో కాలువలు మరమ్మతులకు గురై ఉండటంతో గడిచిన ఐదేళ్లుగా సాగుకు నీరు సక్రమంగా అందేది కాదు. దీంతో రైతులు వర్షాధారం పైనే ఆధార పడి పంటలు సాగు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువలలో పేరుకు పోయిన నాచు తూటాకును తొలగించి, చివరి భూముల వరకు సాగు నీటిని విడుదల చేసి రైతుల మోములో సంతోషాన్ని నింపింది. అయితే వారి ఈ సంతోషం మూణ్ణాళ్ల ముచ్చటగానే ముగిసింది. కొంత కాలంగా కాలువలలో చుక్క నీరు కిందకి రాని పరిస్థితి ఏర్పడింది. సాగర్ కాలువ ద్వారా వంకాయలపాటి మేజర్‌కు నీరు వదులుతున్నప్పటికీ పైనున్న రైతులు నీటి ప్రవాహాన్ని ఆపుతుండటంతో చివరి భూములకు నీరు చేరడం లేదు. సాగర్ ఆయకట్టు భూముల్లో మిర్చి, మొక్కజొన్నతోపాటు పొగాకు సాగుచేస్తున్నారు. ఇప్పుడు ఆయా పొలాల ఆరు తడికి నీరు అందక పోతే పంటలు ఎండిపోయే అవకాశం ఉంది. రైతులు పంట కోల్పోయి ఆర్థికంగా చితిపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి నుంచి రైతులను గట్టెక్కించా లంటే చివరి భూముల వరకు సాగునీటిని విడుదల చేయాలి.

ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి..

- డీసీ కమిటీ చైర్మన్ అయినంపూడి

ఈ పరిస్థితిల్లో వంకాయపాటి మేజర్ డీసీ కమిటీ చైర్మన్ అయినంపూడి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులు వారం రోజులుగా కాలువలపై కాపలా ఉండి సాగు నీటిని ప్రత్తిపాడు ప్రాంతం వరకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. సత్తెనపల్లి నుంచి పేరేచర్ల వరకు నీటికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, ఆ ప్రాంతాలలోనే నీటిని కిందకు రానీయకుండా ఆపేస్తున్నారంటూ అయినంపూడి నాగేశ్వరరావు తెలియజేస్తున్నారు. నీటి కోసం నిత్యం తాము కాలువలపై ఉంటున్నామని, నీరు వదిలి వచ్చిన తర్వాత మళ్లీ నీటి ప్రవాహాన్ని ఆపివేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకుని చివరి భూముల వరకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని డీసీ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు కోరుతున్నారు.

79 మందికి 191 రిటర్నబుల్ ప్లాట్లు


రిటర్నబుల్ ప్లాట్ల ప్రొవిజన్ పత్రాలు అందిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు

తుళ్లూరు,ఫిబ్రవరి12:(ఆంధ్రజ్యోతి)సీఆర్‌డీఏ కార్యాలయంలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో మంగళగిరి, తుళ్లూరుకు చెందిన 79 మంది రైతులకు 191 రిట్నబుల్ ప్లాట్లును కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందచేసినట్లు ఏపీ సిఆర్‌డిఏ కమిషనర్ కె.కన్నబాబు చెప్పారు. లాటరీ ద్వారా ఈ కేటాయింపులు జరిగాయి. కృష్ణాయపాలెం, నవులూరు 1, 2 నిడమర్రు 1, 2 వెలగపూడి మందడం 1, 2 కొరగల్లు 1, 2, తుళ్లూరు 1, 2 నెక్కల్లు, అనంతవరం రైతులకు లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరిగింది. ప్రొవిజనల్ సర్టిఫికెట్లను అందచేసిన కన్నబాబు రైతులకు మాట్లాడుతూ వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఎల్‌పిఎస్ భూముల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆలస్యం కాకుండా ఉండేందుకు కొత్తగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సిఆర్‌డిఏ అదనపు కమిషనర్ సాయి ప్రవీణ్ చంద్, ల్యాండ్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, శేషరెడ్డి, రవీందర్, పి.పద్మావతి, కె.స్వర్ణమేరి, ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. కాగా గురువారం 364 రిట్నబుల్ ప్లాట్‌కు లాటరీ విధానం ద్వారా కేటాయించనున్నారు. అమరావతి కోసం భూములు ఇచ్చిన 11 గ్రామాల్లోని 167 మంది రైతులకు ఈ ప్లాట్లను కేటాయించనున్నారు. దొండపాడు, పిచ్చుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం, శాఖమూరు, వెంకటపాలెం రైతులకు ఉదయం 10 గంటల నుంచి, ఉద్దండరాయునిపాలెం, మల్కాపురం, రాయపూడి 1, 2 కొండమరాజుపాలెం, అబ్బరాజుపాలెం గ్రామాల రైతులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్లాట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

- వ్యవసాయాధికారి అరుణ కుమారి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తాను పండించిన పంటకు ఈ క్రాప్ నమోదు చేయించు కోవాలని ప్రత్తిపాడు వ్యవసాయ శాఖాధికారి అరుణ కుమారి అన్నారు. మండల పరిధిలోని గనికపూడి, గొట్టిపాడు గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ రెండు గ్రామాలలో మొక్కజొన్న, కంది, మినుము సాగుచేస్తున్న రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించు కోవాలన్నారు. అప్పుడు మాత్రమే పంటలను అమ్ముకోవడానికి వీలు ఉంటుందన్నారు. అనంతరం పంటల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి రైతులకు వివరించారు.

విద్యార్థులు చదువులో రాణించాలి

తుళ్లూరు, ఫిబ్రవరి 12:(ఆంధ్రజ్యోతి) విద్యార్థులు చదువులో బాగా రాణించేలా ఉపాధ్యాయులు బోధన ఉండాలని టీచ్ టూల్ అండ్ టీపీడీ మ్యాథ్స్ జిల్లా కో-ఆర్డినేటర్ తోటవీరయ్య అన్నారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లాస్థాయిలో తుళ్లూరు మండలం ప్రథమ స్థానంలో ఉండాలని కెఆర్‌పీఎస్(టీచర్ల)లకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్, టీచ్ టూల్ అబ్జర్వర్స్ టీపీడీ మ్యాథ్స్ కోర్స్ కెఆర్‌పీఎస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి పౌరులు

తుళ్లూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) నేటి బాలలే రేపటి పౌరులని గుడ్ షెప్పర్డ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల కేంద్ర తుళ్లూరు బాలయేసు కాలనీ ఎస్‌పీఎస్ ఎంపీపీ స్కూల్‌లో బుధవారం బాలల పార్లమెంట్ నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ అవుట్స్ లేకుండా చేయటం, విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు పెంపొందించటం, స్థానికంగా ఉన్న సమస్యలు గుర్తించటం వాటికి పరిష్కార మార్గాలు ఎలా అన్వేషించాలి అనే విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. మండలంలో 12 బాలల పార్లమెంట్‌లు ఏర్పాటు అయ్యాయని కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు ఈ సందర్భంగా తెలియ జేశారు.


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ వెంకట్

అతివేగంతో వాహనాలు నడపొద్దు

మంగళగిరిసిటీ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మితిమీరిన వేగంతో వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు. మంగళగిరి మండలం చినకాకాని, కాజ బైపాస్‌లో అతివేగంగా వాహనాలను నడుపుతున్న యువకులకు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న నలుగురు యువకులను ఆపి రూ.2,535 జరిమానా విధించారు. ర్యాష్‌గా బైకులను నడపడం వలన రోడ్డుపై వెళ్లే మిగతా వాహనచోదకులకు అసౌకర్యంగా వుంటుందని, వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు సంభవిస్తాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడ్, మద్యం తాగి వాహనాలను నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


శ్రీల ప్రభుపదుల వారికి విశ్వగురువు బిరుదును స్వీకరించిన ఇస్కాన్ ప్రతినిధులు

శ్రీల ప్రభుపాదులకు విశ్వగురువు బిరుదుపై హర్షం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్, హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకుడు ఆచార్య శ్రీల ప్రభుపాదులకి విశ్వగురువుగా బిరుదును ప్రదానం చేయడం పట్ల హరేకృష్ణ మూవ్‌మెంట్, అక్షయపాత్ర రీజనల్ ప్రెసిడెంట్ వంశీధరదాస హర్షం వ్యక్తంచేశారు. భారతదేశంలో సనాతనధార్మిక సంస్థగా పేరుగడించిన అఖిల మహాకుంభమేళా సందర్భంగా ఈబిరుదును ప్రదానం చేయడం గొప్ప విషయమన్నారు. బెంగుళూరు ఇస్కాన్ అధ్యక్షుడు మధు పండిత దాస, ఉపాధ్యక్షుడు చంచలపతి దాసలు ఈ బిరుదును అందుకున్నారని తెలిపారు. ఈబృహత్తర కార్యక్రమంలో తాను పాల్గొనడం గొప్ప అదృష్టమని అన్నారు. శ్రీల ప్రభుపదుల వారికి విశ్వగురువు బిరుదు వచ్చేందుకు కృషి చేసిన బెంగుళూరు ఇస్కాన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పౌల్ట్రీ నిర్వాహకులు బయో జాగ్రత్తలు తీసుకోవాలి

ఫిరంగిపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి వల్ల అధిక సంఖ్యలో కోళ్ళు మరణిస్తుండటంతో నివారణ చర్యల్లో భాగంగా పౌల్ట్రీ నిర్వాహకులు బయో జాగ్రత్తలను తప్పనిసరిగా తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి షేక్ పీరా అహమ్మద్ కోరారు. బుధవారం మండలంలోని గ్రామాల్లో కోళ్ళ ఫారాలను పశు సంవర్ధకశాఖ అధికారులతో పరిశీలించిన ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అహమ్మద్ మాట్లాడుతూ ఈ వైరస్ వ్యాప్తి చెందకుండా, కోళ్ళు అనారోగ్యం భారిన పడకుండా ఫారాల్లో చల్లదనంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి జిల్లాలో మండల స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ర్యాపిడ్ టీమ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

- పోలీసులకు ఫిర్యాదు

దుగ్గిరాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామం చిలువూరులో తెల్లవారుజామున ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేసి స్థానికులను భయభ్రాంతులకు గురిచేశాడని బుధవారం గ్రామానికి చెందిన ఆలపాటి శ్రీనివాస్ దుగ్గిరాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శ్రీనివాస్ ఫిర్యాలులో పేర్కొన్న వివరాల ప్రకారం.. తన కుమారుడు సాయికృష్ణ ద్విచక్ర వాహనంపై రైల్వేగేటు వద్ద నిల్చుని ఉండగా ఓ యువకుడు 'నీ కులం ఏంటి' అని అడిగి దుర్భాషలాడాని, దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దౌర్జన్యానికి పాల్పడిన యువకుడు విజయవాడకు చెందిన వాడని, అసెంబ్లీ ఎన్నికల సమయం నుంచి గ్రామంలో ఉంటున్నాడని స్థానికులు చెప్పినట్లు సమాచారం. తరచూ రైల్వేగేటు సమీపంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మొక్కజొన్నలో కత్తెర పురుగు

నివారణ చర్యలు చేపట్టాలి

కాకుమాను, ఫిబ్రవరి 12: రబీలో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి కిరణ్మయి రైతులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన కాకుమానులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కత్తెరు పురుగు ఉన్నట్లయితే నవల్యూరాన్, ప్రొక్లెన్‌లను పిచికారి చేసుకోవాలన్నారు. అలాగే రైతులకు యూనిక్ కోడ్ అమలులోకి వస్తుందని కోడ్ వలన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, వంటి ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీఈవో శివ ప్రసాద్ వీఏఏ షణ్ముఖ క్షేత్రపాల్, రైతులు పాల్గొన్నారు.


గుండిమెడ, మెల్లెంపూడి గ్రామాలలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

లక్ష్మణరావును గెలిపించండి

- సీపీఎం, ప్రజాసంఘాల నేతల ప్రచారం

తాడేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విద్యావేత్త కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని గుండిమెడ, మెల్లెంపూడి గ్రామాల్లో సీపీఎం, ప్రజాసంఘాల నేతలు కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్నా శివ శంకర్ మాట్లాడుతూ శాసన మండలిలో ప్రజల గొంతుకై పోరాడేది లక్ష్మణరావేనని, పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును లక్ష్మణరావుకు వేయాలని కోరారు. సీపీఎం రూరల్ మాజీ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, సామాన్య మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజావాణి వినిపించే వ్యక్తి లక్ష్మణరావు అని ఆయనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పల్లెకృష్ణ, నాగపోగు విజయరాజు, కంచర్ల సాంబశివరావు, భరత్, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

తాడేపల్లి పట్టణంలో లక్ష్మణరావు గెలుపును కోరుతూ ఆర్‌ఎంఎస్ కాలనీ, శివదుర్గాపురం, నులకపేట, రాయల్ పబ్లిక్ స్కూల్, అంబేద్కర్ కాలనీ, పోలీసుస్టేషన్ వెనుకబజారు, వెంకయ్యకొట్టు సెంటర్, మునిసిపల్ కార్యాలయం ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శ్రీనివాసకుమారి, సుబ్బారెడ్డి, దుర్గారావు, బాబూరావు, విజయభాస్కరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకన్న, రమణ, తులశమ్మ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామి వారి వార్షిక కల్యాణం

కాకుమాను(అప్పాపురం), ఫిబ్రవరి 12: మండల పరిధిలోని అప్పాపురంలో ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బుధవారం స్వామి వారి వార్షిక కల్యాణాన్ని నిర్వహించారు.మండపంలో ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి కళ్యాణం నిర్వహించారు. వార్షిక కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది.

గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన


విద్యార్థులు, అధ్యాపకులతో ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీనయన కొల్లి

తాడేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం, వడ్డేశ్వరంలోని కేఎల్‌డీమ్డ్ యూనివర్సిటీలో ఎన్‌సీసీ 10వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌పై పీసీవోడీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్టర్ రమేష్ ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శ్రీనయన కొల్లి మాట్లాడుతూ మహిళలను ప్రభావితం చేసే ఒత్తిడితో కూడిన ఆరోగ్య సమస్యలపై సూచనలు చేశారు. గర్భాశయ రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించడానికి పాప్‌స్మెర్స్ మామోగ్రామ్‌ల వంటి సాధారణ స్క్రీనింగ్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి విసి డాక్టర్ కె రాజశేఖరరావు, ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, ఎన్‌సిసి లెఫ్టినెంట్ పావని పాల్గొన్నారు.

పశ్చిమడెల్టా కాల్వకు

1818 క్యూసెక్కులు

దుగ్గిరాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 1818 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.7 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు క్యూసెక్కులు నీరు, తూర్పుకాల్వకు 320 క్యూసెక్కులనీరు, పశ్చిమకాల్వకు 150 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 120 క్యూసెక్కులనీరు, కొమ్మమూరుకాల్వకు 469 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు. రేపల్లెకాల్వకు నీటివిడుదల నిలిపివేశారు.

537 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఫిబ్రవరి 12: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 103 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 7,400 గరిష్ఠ ధర రూ. 10,400 మోడల్ ధర రూ.10,400 పలికాయి. కాయ విక్రయాలు జరుగలేదు.

నేడు కార్మికుల సభ్యత్వ నమోదు

మంగళగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భవన, అనుబంధ నిర్మాణ రంగంలోని కార్మికుల సంక్షేమ బోర్డులో సభ్యులుగా కార్మికులకు గుర్తింపు నమోదు చేసే ప్రక్రియను గురువారం మంగళగిరి పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ టిడ్కో గృహ సముదాయంలో నిర్వహిస్తున్నట్టు కార్మిక శాఖ అధికారులు తెలిపారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, గడిచిన ఏడాదితో కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసి వుండాలన్నారు. సంబంధిత నమూనా ఫారం, రెండు పాస్‌పోర్టు ఫోటోలు, ఆధార్, బ్యాంకు ఖాతా, నామినీ ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్సు కాపీలతో ఉదయం పది గంటలకు టిడ్కో సముదాయంలోని బీ22 బ్లాకు వద్దకు రావాలని, రూ.110 చెల్లించి ఐదు సంవత్సరాలకు సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు.

16న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి పుల్లేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న మంగళగిరి వైష్ణవి కల్యాణ మండపంలో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి పుల్లేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుల్లేశ్వరరావు నాలుగు దశాబ్దాలపాటు పవర్ లిఫ్టింగ్‌లో ఎంతో మంది జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించారని, ఆయన సేవలకు గుర్తుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 16వ తేదీ ఉదయం 7 గంటల కల్లా బాడీ వెయింగ్ తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ వయస్సు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పవర్ లిఫ్టింగ్, బెంచి ప్రెస్ పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. ప్రకటన జారీ చేసిన వారిలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సందాని, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాతకోటి భాస్కరరావు ఉన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

దుగ్గిరాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏటా మాఘమాసంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వీరమ్మ పేరంటాలు, చింతయ్య స్వామివార్ల కల్యాణోత్సవం బుధవారం నిర్వహించారు. మండలంలోని పెనుమూలిగ్రామంలో మూడ్రోజుల పాటు జరిగే తిరునాళ్ల సందర్భంగా తొలిరోజు గ్రామోత్సవానంతరం రెండోరోజు తెల్లవారుజామున జరిగిన కల్యాణోత్సవంలో తొలుత పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. అనంతరం పన్నాల రామనాథ్ నేతృత్వంలో పలువురు దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. సాయంత్రం పసుపుబండ్ల ఊరేగింపులో యువకులు పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోండి

- ఐజీకి ఫిర్యాదు చేసిన తల్లి

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడిని తప్పుడు కేసులో ఇరికించిన మేడికొండూరు సీఐ మీరా సాహెబ్‌పై చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరంలోని ఎస్వీఎన్ కాలనీ 4వ లైన్‌కి చెందిన కాండ్రు సీత బుధవారం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని కలిసి ఫిర్యాదు చేశారు. సీత తెలిపిన వివరాల ప్రకారం.. తన కుమారుడు పేరేచర్ల పరిధిలోని ఆగ్రో ప్రొడక్ట్స్ కాంపౌండ్‌లో డైరీ ఫారం నిర్వహిస్తున్నాడు. ఈనెల 4న రాత్రి 9 గంటల సమయంలో డైరీ ఫారం స్థల యజమాని కుర్ర వెంకట రమణకు మరికొందరికి ఆర్థిక లావాదేవీల విషయంలో ఘర్షణ పడ్డారన్నారు. ఆ గొడవకు సంబంధించిన కేసులో తన కుమారుడికి ఏ సంబంధం లేకున్నా ఇరికించారన్నారు. పైగా రెండు లక్షలు ఇస్తే కేసు నుంచి తన కుమారుడిని తప్పిస్తానని సీఐ డిమాండ్ చేశాడని, తాను ఆ డబ్బులు ఇవ్వకపోవడంతోనే తన కుమారుడిని సీఐ అరెస్ట్ చేశాడని ఆమె తెలిపారు. ఘర్షణతో ఎటువంటి సంబంధం లేని తన కుమారునిపై తప్పుడు కేసు బనాయించిన మేడికొండూరు సీఐ మీరాసాహెబ్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది.


పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్న కూటమి నాయకులు

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మంగళగిరి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. శ్రీచైతన్య స్కూల్, నారాయణ కళాశాల, శ్రీచైతన్య కళాశాల, రవీంద్రభారతి స్కూల్ అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ల సమస్యలను శాసనమండలిలో వినిపించాలంటే కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆలపాటిని గెలిపించాలని కోరుతూ 8వ వార్డు ఆంజనేయ కాలనీలో జరిగిన ఇంటింటి ప్రచారంలో ఎన్నికల పరిశీలకుడు జంపాల సీతారామయ్య పాల్గొన్నారు. పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటును ఆలపాటికి వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో కూటమి నేతలు గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, కందుల నాగార్జున, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, గోసాల రాఘవ, చెల్లూరి సత్యనారాయణ, మహమ్మద్ ఆరిఫ్, జింకా మల్లేశ్వరరావు, అలుగూరి వీరాంజనేయులు, గోవాడ రవి, వంగర సదాశివరావు, కేసనం అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. మంగళగిరి ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం సాయంత్రం విస్తృత సమావేశం జరిగింది. సీఐటీయూ నేత పాశం రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన అనేక వాగ్దానాలను అమలు జరిపే విధంగా శాసనమండలిలో మాట్లాడగలిగే లక్ష్మణరావును గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు వీసం జవహర్‌లాల్, రాఘవులు, బాలాజీ, ఈమని అప్పారావు, చెంగయ్య, పీ.బాలకృష్ణ, ఎం.చలపతిరావు, జే.బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి టౌన్, (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బుధవారం తాడేపల్లి ముగ్గురోడ్డు రవీంద్రభారతి స్కూల్, మునిసిపల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, భగవాన్ స్కూల్, అలాహాబాద్ బ్యాంక్ తదితర ప్రాంతాల్లో టీడీపీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, నేతలు దారా దాసు, కేళి వెంకటేశ్వరరావు, ఇట్టా భాస్కర్, తాడిబోయిన గోపి, దుర్గారావు, ప్రసాద్, రషీద్దీన్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ పోటీచేస్తున్న కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందించి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జెట్టి బాలరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి గొర్రెపాటి శ్రీనివాసరావు, కౌలు రైతుసంఘ అధ్యక్షుడు భీమవరపు అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

కేఎల్‌యూ అధ్యాపకుడికి

గ్లోబల్ ఎమినెన్స్ అవార్డు



వివిఎస్ మూర్తి వలివేటిని అభినందిస్తున్న కేఎల్‌యూ ఇన్‌చార్జి రాజశేఖరరావు

తాడేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కెఎల్ డీమ్డ్ యూనివర్సిటిలో దూర విద్యాకేంద్రం, ఆన్‌లైన్ విద్యావిభాగంలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైనర్‌గా పని చేస్తున్న వివిఎస్ మూర్తి వలివేటికి గ్లోబల్ ఎమినెన్స్ అవార్డును ఇంటర్నేషనల్ మల్టీ డిస్‌ప్లీనరీ రీసెర్చ్ ఫౌండేషన్ (ఐఎంఆర్ఎఫ్)అనేసంస్థ ప్రధానం చేసినట్టు ఇన్‌చార్జి వీసీ డాక్టర్ రాజశేఖరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ వర్సిటీలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైనర్ రంగంలో వివిఎస్ మూర్తి వలివేటి అందించిన సేవలను గుర్తించి ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన అవార్డు లభించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. విద్యను సాంకేతికతతో సమ్మిళితంగా రూపకల్పన చేయడంలో స్వయంగా నేర్చుకునే పాఠ్య సామగ్రిని అభివృద్ధిచేయడంలో, డిజిటల్ లెర్నింగ్ మాధ్యమాలను సమర్థవంతంగా ఉపయోగించడంలో వివిఎస్ మూర్తి వలివేటి చేసిన కృషికి ఈ అవార్డు ఓ గౌవరం అని అన్నారు. ఇటీవల ఈ అవార్డును అంతర్జాతీయ విద్యా దినోత్సవం రోజు ఐఎంఆర్ఎఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ వారు అందజేయగా బుధవారం కెఎల్‌యూ ప్రాంగణంలో అవార్డు గ్రహీతను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి విసి డాక్టర్ కె రాజశేఖరరావు, ప్రోవీసీ డాక్టర్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, దూరవిద్యా కేంద్రం, ఆన్‌లైన్ విద్యావిభాగం డైరెక్టర్ డాక్టర్ ఎంవి నరేష్ పాల్గొన్నారు.

ఐఏ అండ్ ఏడీ క్రికెట్ టోర్నీలో

ఫైనల్‌కి కర్ణాటక, కేరళ

- సెమీస్‌లో తమిళనాడు, ఏపీ-తెలంగాణ జట్ల ఓటమి
- మంగళగిరి స్టేడియంలో నేడు ఆఖరి పోరు
- హాజరుకానున్న మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రిన్సిపల్ ఎకౌంటెంట్ జనరల్ కార్యాలయం నేతృత్వంలో ఇండియన్ ఆడిట్స్, ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న ఐఏ అండ్ ఏడీ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంటులో భాగంగా మూడవ రోజు జరిగిన రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. ఆయా పోటీల్లో కర్ణాటక, కేరళ జట్లు గెలుపొంది ఫైనల్ చేరుకున్నాయి. కేరళ, తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. మంచి ఫామ్‌లో వున్న వేదాంత్ భరద్వాజ్ ఈ మ్యాచ్‌లోనూ అద్భుతంగా రాణించి 56 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 81 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కేరళ జట్టు 17.4 ఓవర్లలోనే భారీ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. కేరళ బ్యాటర్ సచిన్ సురేష్ 39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 62 పరుగులు, ఎంఎస్ అఖిల్ 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 55 పరుగులు చేసి కేరళ విజయంలో కీలకపాత్ర పోషించారు. తమిళనాడు బౌలర్ విఘ్నేష్ రెండు వికెట్లు పడగొట్టాడు.

ఏపీ-తెలంగాణ, కర్ణాటక మధ్య జరిగిన రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో కర్ణాటక జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. ఏపీ-తెలంగాణ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. ఎస్.తరుణ్ 28 బంతుల్లో 36 పరుగులు చేయగా, కర్ణాటక బౌలర్లు ఏఎం కిరణ్ 4 వికెట్లు, అర్జున్ గౌడ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక జట్టు 17.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి గెలుపొందింది. కర్ణాటక బ్యాటర్ జే.సుచిత 38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 64 పరుగులు చేశాడు. ఏపీ-తెలంగాణ బౌలర్ కే.భీమారావు రెండు వికెట్లు పడగొట్టాడు. సెమీస్‌లో గెలుపొందిన కర్ణాటక, కేరళ జట్ల మధ్య గురువారం ఉదయం 9:30 గంటలకు ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. మ్యాచ్ అనంతరం బహుమతి ప్రదానోత్సవానికి పార్లమెంటు మాజీ సభ్యుడు గోకరాజు గంగరాజు హాజరుకానున్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

15న 'సోర్స్ - రిసోర్స్': మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 15 తేదీన సోర్స్ - రిసోర్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం పారిశుధ్యంపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల మూడో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సోర్స్-రిసోర్స్ అనే ప్రత్యేక కార్యాచరణతో వార్డుల్లో అందరూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, నగరదీపికలతో కలసి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కమిషనర్ శేషన్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జరిమానా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురిపై టూ టౌన్ ఎస్ఐ బాబురావు కేసులు నమోదుచేసి మొదటి అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వివేకావర్ధిని తీర్పు చెప్పారని ఎస్ఐ తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

కొల్లిపర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కోడి పందాలు ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ప్రకారం కొల్లిపర మండలం కుంచవరంలో కోడి పందాలు ఆడుతున్నట్లు సమాచారం రావటంతో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నున్న రూ 5వేలు నగదుతో పాటు కోడి పుంజును, 7బైక్‌లను స్వాధీనం చేసుకుని సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హోటల్ నిర్వాహకుడు దాడి చేశాడంటూ ఫిర్యాదు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హోటల్ నిర్వాహకుడు దాడి చేశాడంటు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని ఓ హోటల్ నిర్వాహకుడికి పక్కనే కూల్ డ్రింక్ షాపు నిర్వహించే నిర్వాహకుడికి మధ్య చిన్న వివాదం ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో హోటల్ నిర్వాహకుడు వెంకట శివన్నారాయణ చౌదరి తనపై దాడికి పాల్పడినట్లు బాధితుడు శ్రీనివాసరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

తెనాలి క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో మార్చి 8న తెనాలి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ డి.శ్రీనివాసులు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ అన్నిరకాల సివిల్ కేసులు, భరణం కేసులు, బ్యాంకు లావాదేవీల కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. మధ్యవర్తులతో కూర్చుని పరిష్కరించుకోగల చిన్న చిన్న కేసుల్లో కూడా ఎక్కువమంది కోర్టులకు వచ్చి విలువైన కాలాన్ని, ధనాన్ని నష్టపోతున్నారన్నారు. కక్షిదారులు సమన్వయంతో వ్యవహరించి సామరస్యంగా కేసులు పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ తోడ్పడుతుందన్నారు. తెనాలి కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్‌ని వినియోగించుకోవాలని న్యాయాధికారి కోరారు.

జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సదరం రీ వెరిఫికేషన్ ప్రారంభం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజులు నిర్వహించే సదరం రీ వెరిఫికేషన్ ప్రక్రియ తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో బుధవారం ప్రారంభమైంది. దాదాపుగా 100 మంది వరకు ప్రత్యేక క్యాంపునకు హాజరై సర్టిఫికేట్‌ను రీ వెరిఫికేషన్ ద్వారా వైద్యపరీక్షలు చేయించుకున్నట్లు వైద్యశాల వర్గాలు తెలిపారు. గురు, శుక్రవారాల్లో కూడా ఈ శిబిరం కొనసాగుతుందన్నారు.

బీజేపీ పట్టణ దక్షిణ మండల అధ్యక్షుడిగా చైతన్యకృష్ణ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పట్టణ దక్షిణ మండల అధ్యక్షుడిగా గోవాడ చైతన్యకృష్ణను నియమించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు బుధవారం నియామక పత్రం అందించారు. పట్టణంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. దేశంలో బీజేపీ అన్ని రాష్ట్రాల్లోనూ విజయం సాధిస్తుందని, ప్రధాని మోదీ నాయకత్వంలో పార్టీ దేశం మొత్తం గెలిచే రోజు దగ్గరలో ఉందన్నారు. పార్టీ నేతలు గాజుల వెంకయ్య నాయుడు, రత్నరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

కొల్లిపర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యనందించాలని ఎంఈవో సాల్మన్‌రాజు అన్నారు. బుధవారం మండల పరిధిలోని సిరిపురం, అత్తోట గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాల్మన్‌రాజు మాట్లాడుతూ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ఉపాధ్యాయులపై ఆధారపడి ఉందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రతి నెల విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రమాదకరంగా రహదారిపై గుంత

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిడుబ్రోలు జయ భారత్ రెడ్డి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రహదారి మధ్యలో గుంత ఏర్పడటంతో వాహనదారులు పాదచారులు ప్రమాదానికి గురవుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నారులు ఈ రహదారిపై ప్రయాణిస్తే ఎక్కడ గాయాలు పాలవుతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే రహదారిపై ఏర్పడిన గుంతను పూడ్చివేయాలని జయ భారతరెడ్డి కాలనీ వాసులు మునిసిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



జయ భారత్ రెడ్డి కాలనీలో ప్రమాదకంగా ఉన్న గుంత

నిరాధార ఆరోపణలు తగదు: తహసీల్దార్ గోపాలకృష్ణ



తెనాలి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూపరంగా భూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ మండలంలో మంచి పేరు పొందిన తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదని తహసీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భూ వివాదంలో తహసీల్దార్ రూ.20లక్షలు లంచం డిమాండ్ చేశారంటూ ఓ వ్యక్తి ఆరోపించటాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తూ మీడియా సమావేశం నిర్వహించారు. మండలంలోని గుడివాడ రైతుకు సంబంధించిన భూ వివాదం కొన్నేళ్లుగా కొనసాగుతోందన్నారు. ఆ భూమి మ్యుటేషన్‌కు సంబంధించి నిబంధనలకు అనుగుణంగా దానిని సవరించడం జరిగిందన్నారు. అయితే కోర్టు వివాదం కూడా ఉన్న నేపథ్యంలో పాస్‌బుక్ జారీ అయ్యే విధంగా ఉత్తర్వులు జారీచేసినట్లు వివరించారు. దీనిపై ఓ వర్గం నుంచి ముడుపులు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణల్లో ఎటువంటి వాస్తవం లేదన్నారు. తన సర్వీస్‌లో ఒక్క రిమార్కు కూడా లేదని నిజనిజాలు తెలియకుండా తనపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. తనపై ఆరోపనలు చేసిన వ్యక్తి తనకు ప్రత్యేకంగా క్షమాపనలు చెప్పారని ఆయన వెంటగ్రామ పెద్దలు కూడా వచ్చి మరోమారు ఇటువంటివి జరగకుండా చూసుకుంటామని తెలపడంతో విడిచి పెట్టడం జరిగిందన్నారు. మండలంలో తనకు మంచి పేరు రావడంతో కొందరు జీర్ణించుకోలేక ఇలాంటి ఆరోపణలు చేస్తూ ప్రచారాలు చేస్తున్నారని, మరో మారు ఇటువంటి ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రతాప్ కుమార్, గుడివాడ గ్రామ సర్పంచ్ యడ్లపల్లి రాకేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తున్న ఈగల్ ఐజీ ఆకే రవి కృష్ణ

పెదకాకాని, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వైద్య సేవలో నిత్యం అనేక సవాళ్లు ఎదుర్కొంటూ ఉండే వైద్యులు వారిలో కొంతమేర ఉపశమనం కలిగించేలా డాక్టర్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించడం చాలా సంతోషకరంగా ఉందని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. నంబూరులోని క్రికెట్ క్రీడా ప్రాంగణంలో బుధవారం డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల డాక్టర్లతో క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకే రవికృష్ణ మాట్లాడుతూ వైద్య సేవలో ప్రతినిత్యం ఎంతో ఒత్తిడిని ఎన్నోరకాల సవాళ్లను ఎదుర్కొనే డాక్టర్లు ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల కొంతమేర ఒత్తిడిని తగ్గించుకోవచ్చని అన్నారు. క్రికెట్ పోటీలలో ప్రతిరోజు సాయంత్రం నిర్వహించేలా అసోసియేషన్ ప్రణాళిక రూపొందించడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు.

కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ఈ క్రికెట్ పోటీలను నిర్వహించిన నిర్వాహకులందరికీ అభినందనలు తెలియజేశారు. క్రికెట్ పోటీలకు ఉమ్మడి జిల్లాలో నుంచి వచ్చే పలువురు వైద్యులు ఒకరినొకరు కలుసుకునే అవకాశం కూడా ఈ పోటీల్లో ఉంటుందన్నారు.

పోటీలను నిర్వహించిన డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టీసీ రెడ్డి, డాక్టర్ ఆవుల శ్రీనివాసరావు లను అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సందీప్ వెల్ల, డాక్టర్ శ్రీనివాసరెడ్డి దాట్ల, డాక్టర్ జాన్ షహీద్, డాక్టర్ ఎండీ అసలం, డాక్టర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్థులకు దుప్పట్లు పంపిణీ



రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న పీపీ యూనిట్ అధికారి డాక్టర్ రమాదేవి, ఉమాకాంత్ తదితరులు

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో బుధవారం క్షయ వ్యాధిగ్రస్థులకు దుప్పట్లు, టవల్స్, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవపల్లి సుభాష్ రమాదేవి పాల్గొని 50మంది క్షయ వ్యాధిగ్రస్థులకు దుప్పట్లు, టవల్స్, నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వారు ఇచ్చే మందులను వైద్యుల పర్యవేక్షణలో వాడాలని క్షయవ్యాధి నుంచి సంపూర్ణంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దాత, విశ్రాంత ఉద్యోగి ముక్కాల వీరయ్య రోగులకు అందిస్తున్న చేయూతను అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలను చేయాలని కోరారు. కార్యక్రమలో దాత ముక్కాల వీరయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారులు అందె చంద్రమౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లికొండ రవికుమార్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌పాల్, టీబీ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లిపరలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య కల్యాణం

ఘనంగా శ్రీ లక్ష్మీతిరుపతమ్మ కల్యాణం

కొల్లిపర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య దంపతుల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించగా మహిళలు హారతులు ఇచ్చారు. కల్యాణ మహోత్సవం నిర్వహించే దంపతులు తలంబ్రాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం పండితులు కల్యాణ మహోత్సవాన్ని రంగ, రంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించటానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా మండలంలోని మున్నంగి, వల్లభాపురం, అన్నవరంగౌడపాలెం, సిరిపురం గ్రామాల్లో వేంచేసియున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

కళాకారుల సంఘ భవనంలో నేత్ర వైద్య శిబిరం



శిబిరంలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుల సంఘ భవనంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు చెందిన వైద్యులు నేత్ర పరీక్షలు చేశారు. 200మంది కళాకారులు శిబిరాన్ని వినియోగించుకున్నారు. సినీ రచయిత బుర్రా సాయి మాధవ్ మాట్లాడుతూ, పరీక్షలు చేయించుకున్న వారందరికి కళ్లజోళ్లు పంపిణీ చేస్తామన్నారు. ఆసుపత్రిలో శుక్లం చికిత్స అవసరమైన వారికి ఉచితంగా చికిత్స చేయిస్తామని తెలిపారు. ఈదర రామారావు ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం, రంగస్థల కళాకారుల సంఘం సంయుక్తంగా శిబిరం నిర్వహించింది. ఈదర వెంకట పూర్ణచంద్, వెంకట్, నవీన్, బుర్రా జయలక్ష్మి, సుబ్బారావు, ఆదినారాయణ, కోటేశ్వరావు, సింగారావు, గుత్తా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

16న సంస్కృత కళాశాల సంచిక మనోరమ ఆవిష్కరణ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సంస్కృత కళాశాల, విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16 ప్రత్యేక సంచిక మనోరమ ఆవిష్కరించనున్నారు. సంచిక ఆవిష్కరణ కరపత్రాలను బుధవారం విడుదల చేశారు. పెన్షనర్స్ హాలులో నిర్వహించే కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తామన్నారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ఉన్న కెఎల్ఎన్ సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థులంతా హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. వినాయకరావు, మురళీకృష్ణ, అప్పారావు, సూర్యనారాయణ, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

సొంత భూములున్న రైతులు పేర్లు నమోదు చేసుకోండి

● ఏడీఏ ఉషారాణి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సొంతగా సాగుభూములున్న రైతులు తప్పనిసరిగా దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని ఏడీఏ ఉషారాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాగుభూమి ఉన్న సొంత రైతులకు వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ సంయుక్తంగా తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో వ్యవసాయ భూమి యజమానుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా ఆయా భూ యజమానులకు 11 అంకెలతో రైతు గుర్తింపు నెంబరు జారీ చేయడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రాయితీ పథకాలు, పంట రుణాలు, పంటల బీమా, పంట కొనుగోలు వంటివి రైతులకు కేటాయించిన ప్రత్యేక నెంబరుతోనే జరుగుతాయన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ రైతు సేవా కేంద్రాల్లో ప్రారంభమైందని భూమి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నెంబరుతో నేరుగా సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రత్యేక నెంబరుతో రైతు కార్డులను పొందాలని ఆమె సూచించారు.

రైతు సేవా కేంద్రంలో పేర్ల నమోదు ప్రారంభం

కొల్లిపర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూ యజమానులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకట్రావు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర రైతు సేవా కేంద్రంలో వ్యవసాయాధికారులు రైతులకు గుర్తింపు నెంబరు ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే 11 అంకెలు గల గుర్తింపు నెంబరును ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మురళి, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.సుధీర్, మౌనిక, రవితేజ, ఆర్.నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీపై ఫిర్యాదు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు నిలిపిన ద్విచక్రవహనం చోరీకి గురైందని పెదరావూరుకు చెందిన తట్టుకుళ్ల శివనాగసాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వీరాంజనేయ స్వామికి పెడన ఎమ్మెల్యే పూజలు



వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శ్రీవీరాంజనేయ స్వామిని బుధవారం కృష్ణా జిల్లా పెడన శాసన సభ్యుడు కాగిత కృష్ణప్రసాద్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అర్చక స్వాములు సంప్రదాయ స్వాగతం పలికారు. వీరాంజనేయ స్వామికి నిర్వహించిన నాగవల్లి దళార్చన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఆలయ అధికారులు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌కు స్వామివారి చిత్రపటం కానుకగా అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. అర్చకస్వాములు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనాలు ఇచ్చారు.


పేదలకు అన్నదానం

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి నైట్ షెల్టర్‌లో పేదలకు బుధవారం అన్నదానం చేశారు. రోటరీ క్లబ్ సభ్యులు షేక్ సుభాని సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో రావి కృష్ణమోహన్, ఈదర పూర్ణచంద్, పావులూరి రాంబాబు, నారాయణ, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా ఆలపాటిని గెలిపించాలంటూ ప్రచారం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించుకుందామంటూ కూటమి శ్రేణులు ప్రచారం చేపట్టారు. బుధవారం పట్టణంలోని రజకపార్క్‌లో వాకర్స్ పట్టభద్రులను, కొలకలూరులో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఆలపాటిని గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేశారు.

ఘనంగా పంచముఖ ఆంజనేయ స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని శ్రీపంచముఖ ఆంజనేయస్వామి రథోత్సవం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ఉష్ట్రవాహన సేవ నిర్వహించారు. అలంకరించిన రథంపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి పట్టణ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, ఎస్‌టీ శివ, అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సంకీర్తన బృందం సభ్యులు రథోత్సవంలో పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొలకలూరులోని కేసవ రాజ్యలక్ష్మిసమేత చెన్నకేశవస్వామి వారి దివ్యరథోత్సవం కనులపండుగగా నిర్వహించారు. బుధవారం గ్రామంలోని చినరథాన్ని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి కేసవ రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి వారి ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి వేలాదిమంది భక్తులతో స్వామి వార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ వీధుల్లో రథోత్సవంగా స్వామి వార్లు భక్తుల పూజలందుకున్నారు. నిర్వాహక కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, పలు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌కు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న యడ్లపల్లి భారతి

ఆలయ అభివృద్ధికి రూ.5లక్షల విరాళం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరులోని కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన యడ్లపల్లి భారతి ఐదు లక్షల విరాళం అందజేశారు. బుధవారం గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ హాజరయ్యారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని పరిశీలించి ఆలయ నిర్మాణ విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చేతుల మీదుగా కోదండ రామస్వామి దేవస్థాన అభివృద్ధికి భారతి రూ.5 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రామినేని శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి

● ఏవో డేగల వెంకటరామయ్య

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూ యజమానులు రైతు విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలని ఏవో డేగల వెంకటరామయ్య తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చింతలపూడి, కసుకర్రు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పైరు పరిశీలించి సమగ్ర యాజమాన్య సాగు పద్ధతులు సూచించారు. ఎకరానికి 50 కిలోల యూరియా, 25 పొటాష్ ఎరువులు అందించాలని సూచించారు. కండె వచ్చే దశ కనుక నీటి తడులు అందించాలన్నారు. రైతులు కేంద్ర ప్రభుత్వ సూచనలు మేరకు రైతు విశిష్ట సంఖ్య కోసం రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. అధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్ ద్వారా ఆన్‌లైన్‌లో రైతు విశిష్ట సంఖ్య పొందవచ్చన్నారు. ఈ సంఖ్య ఉంటేనే కేంద్ర ప్రభుత్వం అందించే రాయితీలు రైతులకు అందుతాయన్నారు. సమావేశంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.